# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 220 | హైదరాబాద్ | సోమవారం 23-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




అపరేషన్ కగార్‌లో కీలక పరిణామం...
మావోయిస్టు కీలక నేతలు లొంగుబాటు

11లో

జగన్‌కు లోకేశ్ ఘాటు కౌంటర్..

## మీది కపట ప్రేమ అంటూ ఫైర్



11లో

- పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసింది జగనేనన్న లోకేశ్
- గతంలో జగన్ తీసుకున్న నిర్ణయాలను ఏకరువు పెట్టిన లోకేశ్
- కపట ప్రేమతో ఇప్పుడు నీతులు చెబుతున్నారంటూ తీవ్ర విమర్శ




హార్వర్డ్ నుంచి సీఎం

## రేవంత్ రెడ్డికి ఆహ్వానం

- ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- తెలంగాణ ఏఐ సిటీ విజన్‌కు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు
- ఏఐ మౌలిక వసతులపై మాట్లాడనున్న రేవంత్ రెడ్డి

11లో

ఐఎన్ఎస్ అరిదమన్..

భారత్ అమ్ములపొదిలో

## శత్రుభీకర అస్త్రం

- ఏప్రిల్-మే నాటికి భారత నావికాదళంలోకి చేరనున్న అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమన్
- ఇప్పటికే ఉన్న అరిహంత్, అరిఘాత్ కంటే పెద్దది, ఎక్కువ క్షిపణులను మోసుకెళ్లగలదు
- శత్రు రాడార్లకు చిక్కని అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీ, తక్కువ శబ్దం చేసే రియాక్టర్ దీని సొంతం
- భారత ద్వితీయ అణుదాడి సామర్థ్యాన్ని ఈ సబ్‌మెరైన్ గణనీయంగా పెంచనుంది
- పూర్తిగా విశాఖపట్నంలోనే స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మాణం




11లో



దేశంలోనే వేగవంతమైన మెట్రో..

## మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని

- గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనున్న మెట్రో
- నమో భారత్ రైలు సేవలను కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఢిల్లీమీరట్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్

11లో

ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ

## హైస్పీడ్ ఇంటర్నెట్




11లో



ఏపీ సీఎం చంద్రబాబుతో

## డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ

- సీఎం చంద్రబాబుతో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల సమావేశం
- ఏవియేషన్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులపై చర్చలు
- తమ కార్యకలాపాలపై సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చిన సంస్థ
- ఏపీలో ఉన్న అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వివరించిన సీఎం

11లో

- సరూర్ నగర్ సర్కిల్‌లో పన్నుల మాయాజాలం.
- ట్రేడ్ లైసెన్స్‌లో ఒక లెక్క.. ఆస్తి పన్నులో మరోక లెక్క
- నిబంధనలు తుంగలో తొక్కి..అక్రమ 'అసెస్మెంట్'లతో కోట్లు కొల్లగొడుతున్న అధికారులు
- సరూర్నగర్ సర్కిల్ డి.సి బోనగిరి శ్రీనివాస్ కు జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సపోర్ట్.
- జిహెచ్ఎంసి కొత్త కమిషనరేట్ మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ ఏం చర్యలు తీసుకుంటారు..?
- క్షేత్రస్థాయిలో తిమింగలాలు.. ఏసీబీ, విజిలెన్స్ విచారణకు సామాన్యుల డిమాండ్
- అవినీతి తేటతెల్లమైన అధికారులపై చర్యలు శూన్యం మున్సిపల్ శాఖ మధ్యలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి

బల్దియా ఖజానాకు

## 'అవినీతి' గండి!




12లో

భారత శక్తి

# హిట్ అండ్ రన్ రాజకీయాల్లో ప్రతిపక్ష పార్టీలు

"నిజమైన ప్రతిపక్షం ప్రభుత్వానికి శత్రువు కాదు, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీసే ఒక జాగృత శక్తి "ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరగడం, మెజారిటీ వచ్చిన వారు పాలించడం మాత్రమే కాదు. అధికార పక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినప్పుడు కళ్ళెం వేసే ప్రతిపక్షం ఉండటం ఆ వ్యవస్థకు ప్రాణవాయువు వంటిది. కానీ, నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షం అంటే కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అనే సంకుచిత అర్థానికి పరిమితమైపోయింది. క్షేత్రస్థాయిలో పోరాటాల కంటే, సోషల్ మీడియా వేదికగా సాగే ట్రోలింగ్ రాజకీయాలే జ్యమేలుతున్నాయి. ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టించే వ్యవస్థ. అసెంబ్లీలో తార్కికమైన చర్చలు, బయట ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు ఉండేవి. ఒక జీవో విడుదల చేయాలంటేప్రభుత్వం పదిసార్లు ఆలోచించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రతిపక్షాలు తాము అధికారంలో లేమన్న విషయాన్ని జీర్ణించుకోలేక, ప్రజల కోసం పోరాడటం కంటే తమ ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికార పక్షంపై వ్యతిరేకత పెంచితే చాలు, తదుపరి అధికారం తమకే దక్కుతుందనే ఒక రకమైన నెగటివ్ పాలిటిక్స్ భ్రమలో ప్రతిపక్షాలు ఉండిపోతున్నాయి. అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపడం కంటే, వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాల ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఏకైక అజెండాగా మారిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తోంది. గత ఎన్నికల్లో సుమారు 40 శాతం ఓటు బ్యాంకును, కోటి మందికి పైగా ప్రజల మద్దతును పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రతిపక్ష హోదా అనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి సభకు దూరం కావడం ఆ ఓటర్లను వంచించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్య కంటే గొంతుక ముఖ్యం. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా, వారు సభలో తార్కికంగా మాట్లాడితే ప్రభుత్వం దిగిరాక తప్పదు. కానీ, వైసీపీ నాయకత్వం కేవలం తమపై వస్తున్న కేసుల నుండి రక్షణ పొందడానికో లేదా తమ సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికో పరిమితమవుతోంది. తమ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజల వద్దకు వెళ్లాల్సింది పోయి, అధికార పక్షం మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది అనే విక్టిమ్ కార్డ్ వేసుకోవడం వల్ల ప్రజల్లో సానుభూతి కంటే అసహనమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం వైసీపీ చేస్తున్న పోరాటాలన్నీ ఎక్కువగా కేసుల చుట్టూ, పార్టీ నేతల రక్షణ చుట్టూనే తిరుగుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల అమలు , ప్రభుత్వ వైఫల్యాల మీద నిర్మాణాత్మక విమర్శలు చేయడం కంటే, సోషల్ మీడియాలో బురద చల్లడం పైనే ఆ పార్టీ యంత్రాంగం ఎక్కువ దృష్టి పెడుతోంది. రాజకీయం అంటే అధికారం కోసం చేసే ఆరాటం మాత్రమే కాదు, అధికారం లేనప్పుడు ప్రజల కోసం చేసే పోరాటం అన్న సూత్రాన్ని విస్మరించి, కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసించిపోతోంది. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యల చర్చా వేదిక, అక్కడ గొంతు వినిపించకపోతే ప్రతిపక్షంగా తన ఉనికిని కోల్పోయినట్టే అవుతుంది. మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంటులో బేషరతుగా మద్దతు ఇస్తూ, రాష్ట్రంలో అదే పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నామని చెప్పడం ప్రజల్లో తీవ్ర అయోమయానికి దారితీస్తోంది. ఈ ద్వంద్వ వైఖరి పరోక్షంగా అధికార పక్షానికే సహకరించడమే అవుతుంది. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా సాగుతున్న ఈ రాజకీయం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. నాయకుడి బలం గెలిచినప్పుడు కాదు, ఓడిపోయినప్పుడు ఎలా నిలబడ్డాడు అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది.. మరోవైపు, అధికార పక్షాన్ని విమర్శించే క్రమంలో వైసీపీ అనుసరిస్తున్న తీరు అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాల్సింది పోయి, ముఖ్యమంత్రిని, మంత్రులను , వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అప్రజాస్వామికం. ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలను సృష్టించడమే కాకుండా, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలనే వ్యూహాన్ని బయటపెడుతున్నాయి. విమర్శలు విధానాల మీద ఉండాలి కానీ, వ్యక్తుల మీద కాదు అనే కనీస రాజకీయ ధర్మాన్ని విస్మరించి, బూతు పురాణాలతో రాజకీయ కలుషితం చేయడం వల్ల ప్రజల్లో అసహనం పెరుగుతోంది. దీన్ని వైసీపీ గుర్తించడం లేదు. తెలంగాణ రాజకీయ యవనికపై ఒకప్పుడు సింహగర్జన చేసిన గులాబీ దళం, నేడు ప్రతిపక్ష పాత్రను పోషించడంలో పూర్తిగా వెనుకబడిపోయింది. మేము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా అవతరించలేదు అని ఆ పార్టీ కీలక నేత జగదీష్ రెడ్డి స్వయంగా అంగీకరించడం వారి దైన్యస్థితికి అద్దం పడుతోంది. పదేళ్ల పాటు పరిపాలించిన అనుభవం ఉన్న పార్టీ, ప్రజా సమస్యలపై పదునైన బాణాలను సంధించాల్సింది పోయి, ఇంకా బాధ్యతారాహిత్యంతో కాలం గడుపుతోంది. ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టింది కేవలం ఫామ్ హౌస్‌లకే పరిమితం కావడానికి కాదు, అసెంబ్లీలో ప్రజా గొంతుకగా నిలవడానికి అని ఇప్పటికీ గుర్తించలేకపోతున్నారా?. బీఆర్ఎస్ ప్రస్తుతం అనుసరిస్తున్న తీరు క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం కంటే, సోషల్ మీడియా వేదికగా అబద్ధాలను వందసార్లు ప్రచారం చేసి నిజం చేయాలనే వ్యూహంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ఆశించడం రాజకీయాల్లో సహజమే, కానీ ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే విశ్వసనీయత ను వారు కోల్పోతున్నారు. రాజకీయాలు అంటే కేవలం అధికార మార్పిడి కోసం చేసే కుతంత్రాలు కాకూడదు. అవి ప్రజా సేవ కోసం చేసే యజ్ఞం కావాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు కావాల్సింది కేవలం విమర్శించే ప్రతిపక్షం కాదు, పరిష్కారాలను చూపే ప్రతిపక్షం. ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడం కాకుండా, అభివృద్ధి పనుల్లో లోపాలను వేలెత్తి చూపిస్తూ, దానికి మెరుగైన ప్రత్యామ్నాయాలను సూచించగలిగే మేధోశక్తి ప్రతిపక్షాలకు ఉండాలి. అసెంబ్లీని గౌరవించడం, సభా మర్యాదలను పాటించడం, ప్రజా సమస్యలపై లోతైన అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే ప్రతిపక్షాలు ప్రజల మద్దతును తిరిగి పొందగలవు. రాజకీయం అంటే కేవలం ఎన్నికల మేనేజ్‌మెంట్ కాదు, అది ప్రజల జీవితాలను మార్చే ఒక గొప్ప సాధనం. ఈ నిజాన్ని గుర్తించి ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోకపోతే, భవిష్యత్తులో వారు ప్రజల నుండి మరింత దూరం కావడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. సమర్థవంతమైన ప్రతిపక్షం లేని రాష్ట్రం దిక్సూచి లేని నావ లాంటిది, కాబట్టి తెలుగు రాష్ట్రాల ప్రతిపక్షాలు తమ అస్తిత్వ పోరాటాన్ని పక్కన పెట్టి ప్రజా హితం కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే.. ఓటములకు కారణాలు చెప్పుకోవడానికి అలవాటు పడాల్సిందే.

# ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు

తిరుపతి, ఫిబ్రవరి 22

కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ? 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను? విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు కూడా టిడిపి కూటమి రాష్ట్రంలో ఉంది. కేంద్రంలో టిడిపి బలమైన భాగస్వామ్య పక్షంగా ఉంది. ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు. ఎన్నికలకు ముందు, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపి కూటమిలో చాలామంది నేతలు చేరారు. ఇప్పుడు వారందరికీ రాజకీయ అవకాశాలు కల్పించడం అనేది కష్టం. ఇటువంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా 50 అసెంబ్లీ స్థానాలు, ఏడు పార్లమెంటు సీట్లు పెరిగితే మాత్రం కూటమికి ప్లస్ గా మారుతుంది. ఇంకోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు.. విభజనతో మరింత బలహీనమవుతాయి. ఇలా ఎటు చూసుకున్నా నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపి కూటమికి ఎక్కువగా మేలు జరుగుతుంది.

# లోకేష్ ను హీరో చేస్తున్న జగన్

విజయవాడ, ఫిబ్రవరి 22



వైసీపీ అధినేత మాజీ సీయం జగన్ మోహన్ రెడ్డి తెలిసి అన్నారో లేక అనుకోకుండా అనేసారో తెలీదు కానీ తనకు లోకేష్ తోనే పోటీ అని తేల్చేశారు. తాజాగా పెట్టిన ప్రెస్ మీట్‌లో ఆయన చంద్రబాబు, పవన్‌తో పాటు నారా లోకేష్‌పై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా అయన టార్గెట్ లోకేష్ వైపే నడిచింది. శ్రీలంకలో ఇండియా ఆడుతున్న ౹20 వరల్డ్ కప్ మ్యాచ్ చూడడానికి ప్రత్యేకంగా లోకేష్ వెళ్ళాలా? ఇంట్లో కూర్చుని చూడకూడదా అంటూ ఆయన సెటైరికల్‌గా మాట్లాడారు. ఇప్పటికే లోకేష్‌పై వచ్చిన విమర్శలకు ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. సొంత డబ్బుతో మ్యాచ్ చూడడానికి వెళ్లినట్టుగానే చెప్పుకొచ్చారు లోకేష్. దానిపై మాజీ ముఖ్యమంత్రి హోదాలో జూ జగన్ ఇప్పుడు మాట్లాడడం ద్వారా సామాన్య జనాలకు ఒక మెసేజ్ ఇచ్చేసారు జగన్ అంటున్నారు ఎనలిస్ట్ లు. ఎందుకంటే సహజంగా జగన్ మాట్లాడే విధానం ఇలా ఉండదు అనేది వారి విశ్లేషణ. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు మాత్రమే తన ప్రత్యర్థి అనీ వేరే ఎవరూ తనకు సమానులు కాదు అన్నట్టుగా జగన్ వ్యవహార శైలి ఉండేది. పాదయాత్ర చేసినప్పుడు గానీ సీయం అయ్యాక గానీ చంద్రబాబు టార్గెట్ గానే జగన్ మాటలు ఉండేవి. లోకేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కూడా ముక్తసరిగా మాట్లాడి ఆ టాపిక్ ని పెద్దగా హైలైట్ చేసేవారు కాదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషయంలోనూ ఆయన వ్యవహారశైలి అలానే ఉండేది. అధికారంలో ఉన్న ఐదేళ్ళలో ఒక్కసారి కూడా పవన్ ను పేరు పెట్టి పిలవ లేదు జగన్. కేవలం 'దత్త పుత్రుడు ' అని మాత్రమే ప్రస్తావించేవారు. కానీ తాజా ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్, లోకేష్ ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోనీ పవన్ ఇప్పుడు ఉప ముఖ్య మంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి తనతో సమానుడు అని భావించినా లోకేష్ ను టార్గెట్ చేయడం తో భవిష్యత్ లో తనకూ లోకేష్ కూ మధ్య మాత్రమే అసలు సిసలు పోటీ అని ఫిక్స్ అయిపోయారా అనే అభిప్రాయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అవునన్నా కాదన్నా ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలోనూ టీడీపీలోనూ నారా లోకేష్ అండ్ టీమ్ దే హవా అన్నది సుస్పష్టం. మొత్తం వ్యవహారాలు అన్నీ ఆయన టీమ్ చక్క బెడుతోంది. మోదీ, అమిత్ షా వంటి బీజేపీ అగ్ర నేతలు కూడా లోకేష్ తో వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్ టీడీపీ అధినేతగా లోకేష్ ని గుర్తిస్తున్నట్టుగానే ఉంది. టీడీపీ సోషల్ మీడియా యూనిట్స్ కూడా దాన్నే ప్రొజెక్ట్ చేస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా జూ జగన్ కూడా లోకేష్ నే తన పొలిటికల్ ప్రత్యర్థిగా డిసైడ్ అయిపోయిన దృశ్యం తెరపైకి వచ్చేసింది. ఇదివరకూ చంద్రబాబు ను టార్గెట్ చేసి జగన్ మాట్లాడుతూ ఉంటే పవన్ పై ఆయన సామాజిక వర్గ నేతలు లోకేష్ పై జగన్ తరువాతి స్థాయి నేతలూ విమర్శలు గుప్పించే వారు. ఇప్పుడు డైరెక్ట్ గా జగనే లోకేష్ ను టార్గెట్ చేయడం చూస్తుంటే పొలిటికల్ గా కింది స్థాయి కేడర్ కు లోకేష్ తన ఫ్యూచర్ పొలిటికల్ ప్రత్యర్థి అనే సంకేతం ఇస్తున్నారా అనే డౌట్స్ రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి.

# చింతకాయలకు ఫిక్స్...

శ్రీకాకుళం, ఫిబ్రవరి 22

టీడీపీలో సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ కు త్వరలోనే కీలక పదవి లభించే అవకాశాలున్నాయి. అయితే తొలుత విజయ్ ను రాజ్యసభ కు ఎంపిక చేయాలని భావించినప్పటికీ ఆ ఆలోచన విరమించుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు కీలక పదవి రిజర్వ్ అయిందని, త్వరలోనే చింతకాయల విజయ్ సూపర్ పదవి దక్కబోతుందన్న సమాచారం ఉత్తరాంధ్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీ గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులన్నీ ఎక్కువగా యువతకే ఇస్తున్నారు. మంత్రివర్గంలో కావచ్చు. రాజ్యసభ స్థానాల్లో కావచ్చు.. మరేదైనా సరే యువతకు అవకాశం ఇస్తున్నారు. పార్టీ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని సీనియర్ నేతలను పార్టీ బలోపేతం కోసం వ్యూహాలను, రోడ్ మ్యాప్ లను సిద్ధం చేయడానికే పరిమితం చేయనున్నారు. వారి అవసరాలను, సేవలను పార్టీ వరకే ఉపయోగించుకున్నారు. ఇది ఫిక్స్. ఇక వచ్చే పదవులన్నీ యువతతోనే ఎక్కువగా నిండిపోతాయన్నది కూడా వాస్తవం. నారా లోకేశ్ భావి నేతగా ఎదుగుతున్న తరుణంలో ఆయన తనకంటూ ఒక టీమ్ ను సెట్ చేసుకోవడం ఇప్పటికే ప్రారంభమయింది. ఇంకా కొనసాగుతుందికూడా. అది ఎమ్మెల్సీ పదవి కావచ్చు. రాజ్యసభ పదవి కావచ్చు.. మరేదైనా కావచ్చు. వచ్చే పదవుల్లో ఎక్కువగా యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా అయ్యన్న పాత్రుడు కుమారుడు విజయ్ ను ఎమ్మెల్సీని చేసి కేబినెట్ లోకి తీసుకోవాలని కూడా పార్టీ నాయకత్వం యోచిస్తున్నారని తెలిసింది.

# హిందూపురంలో బాలయ్య సొంతిల్లు

అనంతపురం, ఫిబ్రవరి 22



హిందూపురం నియోజకవర్గం నందమూరి కుటుంబానికి ఒక కంచుకోట. దివంగత ఎన్టీ రామారావు నుంచి నేటి బాలకృష్ణ వరకు, ఈ గడ్డ నందమూరి వారసులకు ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూనే ఉంది. అయితే, గత పదేళ్లకు పైగా ఇక్కడ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బాలయ్యపై ప్రతిపక్షాలు గురిపెట్టే ప్రధాన అస్త్రం 'స్థానికత'. ఈ విమర్శలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, హిందూపురంలోనే తన సొంత ఇంటి నిర్మాణానికి బాలకృష్ణ భూమిపూజ నిర్వహించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. హిందూపురం నియోజకవర్గం నుంచి 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న నందమూరి బాలకృష్ణ, గత 12 ఏళ్లుగా అక్కడ అద్దె ఇంట్లోనే నివసిస్తున్నారు. షూటింగ్‌లు ఉన్నప్పుడు హైదరాబాద్‌లో, రాజకీయ కార్యకలాపాల కోసం హిందూపురం వచ్చినప్పుడు ఆ అద్దె ఇంట్లో ఉండేవారు. అయితే, ఇవాళ ఆయన తన భార్య వసుంధర దేవితో కలిసి హిందూపురం సమీపంలోని వనం కాలనీలో సొంత ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. వనం కాలనీలోని సర్వే నంబర్ 445లో సుమారు 81 సెంట్ల విస్తీర్ణంలో ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇది మూడు అంతస్తుల డూప్లెక్స్ తరహా భవనం కానుంది. ఇందులో నివాసంతో పాటు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు ప్రత్యేక హాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యేందుకు వీలుగా ఆఫీసు రూమ్‌లను నిర్మించనున్నారు. ఆధునిక హంగులతో పాటు ఒక చిన్న పార్క్, స్విమ్మింగ్ పూల్, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చేలా గ్రీనరీని ప్లాన్ చేసినట్లు సమాచారం. వైసీపీ నేతలు గతంలో పలుమార్లు "బాలకృష్ణ చుట్టపుచూపుగా వచ్చి వెళ్తారు, ఆయనకు ఇక్కడ సొంత ఇల్లు కూడా లేదు" అంటూ విమర్శలు చేసేవారు. ముఖ్యంగా వైసీపీ స్థానిక నాయకులు ఆయనను 'నాన్-లోకల్'గా చిత్రించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు సొంత ఇల్లు నిర్మించుకోవడం ద్వారా, తాను కేవలం గెలిచి వెళ్ళిపోయే వ్యక్తిని కాదని, ఇక్కడే శాశ్వతంగా ఉంటానని బాలయ్య సంకేతాలిచ్చారు. హిందూపురంలో బాలయ్యకు భారీ అభిమాన గణం ఉంది. అయితే, నాయకుడు ఎప్పుడూ అందుబాటులో ఉండరనే చిన్న అసంతృప్తి కార్యకర్తల్లో ఉండేది. ఇప్పుడు సొంత ఇల్లు ఉండటం వల్ల ఆయన నియోజకవర్గంలో గడిపే సమయం పెరుగుతుందని, తద్వారా స్థానిక సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అభిమానులు భావిస్తున్నారు. కేవలం సినిమాల్లోనే కాకుండా, రాజకీయాల్లోనూ తాను సీరియస్ అని బాలయ్య నిరూపిస్తున్నారు. ఇటీవల ఆయన తన సొంత నిధులు రూ. 84 లక్షలు వెచ్చించి నియోజకవర్గంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, ఇప్పుడు సొంత ఇల్లు కట్టుకోవడం వంటివి ఆయన నిబద్ధతను చాటుతున్నాయి. హిందూపురం నియోజకవర్గం అనంతపురం రాజకీయాల్లో అత్యంత కీలకం. ఇక్కడ పట్టు కోల్పోకుండా ఉండాలంటే భౌతికంగా అక్కడ ఉండటం అవసరమని బాలయ్య గుర్తించారు. ఈ సొంత ఇల్లు రాబోయే రోజుల్లో టీడీపీ రాజకీయాలకు ప్రధాన కేంద్రంగా మారే అవకాశం ఉంది. మొత్తానికి నందమూరి బాలకృష్ణ తీసుకున్న ఈ నిర్ణయం హిందూపురం ప్రజల్లో సానుకూల పవనాలను పెంచింది. "మా ఎమ్మెల్యే మా వాడు.. మా మధ్యే ఉంటారు" అనే భావన ప్రజల్లో బలంగా నాటుకునేలా ఈ గృహారంభం తోడ్పడుతుంది. కేవలం ఒక భవన నిర్మాణంగా కాకుండా, తన రాజకీయ ఉనికిని మరింత సుస్థిరం చేసుకునే దిశగా బాలయ్య వేసిన 'మాస్ స్టెప్'గా దీనిని అభివర్ణించవచ్చు.

# జగన్ పై కేసుల్లేవ్..

విజయవాడ, ఫిబ్రవరి 21,ఫిబ్రవరి 22

వైసీపీ అధినేత వైఎస్ జగన్ విషయంలో కూటమి సర్కార్ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. జగన్ ను ఎప్పుడు అరెస్ట్ చేస్తారని? ఆయనపై కేసులు ఎప్పుడు నమోదవుతాయని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న తెలుగు తమ్ముళ్లకు ఇప్పుడు సమాధానం దొరికిందంటున్నారు. జగన్ పై కేసులు రాష్ట్రంలో నమోదయ్యే అవకాశాలు లేవు. అలాగే జగన్ ను అరెస్ట్ కూడా చేయడం జరగదు. ఇది ఎవరో చెప్పింది కాదు. టీడీపీ అగ్ర నేతల నుంచి వచ్చిన సమాచారం అంటున్నారు. జగన్ ను అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేసి సానుభూతి ఆయనపై కురిపించడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదు. వచ్చే ఎన్నికల్లో కూటమి తిరిగి అధికారంలోకి రావాలంటే జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదన్నభావన పార్టీ అగ్రనాయకత్వంలో వ్యక్తమవుతుంది. అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ జగన్ పై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మద్యం కేసులో కానీ, మరొక కేసులో కానీ వైసీపీ నేతలను, జగన్ కు అత్యంత సన్నిహితులను అరెస్ట్ చేశారు. ఒకరు కాదు... ఇద్దరు కాదు చాలా మంది జగన్ ముఖమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో పనిచేసిన వారిని సయితం అరెస్ట్ చేశారు. కేసులు నమోదు చేశారు. అయితే జగన్ మీద మాత్రం ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంపై టీడీపీ సోషల్ మీడియాలో పార్టీ కార్యకర్తలు పెద్దయెత్తున విమర్శలు చేస్తున్నారు. జగన్ విషయంలో ఇంత నాన్చుడు ధోరణి ఎందుకని? రెడ్ బుక్ లో జగన్ పేరు లేదా? అని ప్రశ్నిస్తున్నారుకానీ చంద్రబాబు, లోకేశ్ మాత్రం జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని ఫిక్సయిపోయారు. జగన్ ను టచ్ చేస్తే సానుభూతి వస్తుందని, కూటమి ప్రభుత్వ విజయావకాశాలపై దెబ్బపడుతుందని ఢిల్లీ పెద్దలు కూడా సలహా ఇచ్చారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చేత అరెస్ట్ చేయించాలని కొన్నాళ్లు చేసిన ప్రయత్నాలకు కూడా బీజేపీ అగ్ర నేతలు అంగీకరించలేదని తెలిసింది. చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ ఎంత భారీ మూల్యం చెల్లించుకున్నాడో వారు గుర్తు చేసి వద్దని చెప్పి పంపుతున్నారట. అందుకే జగన్ విషయంలో కూటమి ప్రభుత్వం ఈ టర్మ్ లో వెళ్లే అవకాశం లేదన్నది సుస్పష్టం. జగన్ కు అనవసరంగా సానుభూతి తెచ్చి పెట్టే ఆలోచనలకు కూటమి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

# కాంగ్రెస్ అగ్నిపరీక్ష గా ఐదు రాష్ట్రాల ఎన్నికలు

పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు వచ్చే మా?డు నెలల్లో జరగనున్నాయి. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తామని అనుకున్న రాష్ట్రాల్లో కూడా ఓడిపోతోంది. రాను రాను ఆ పార్టీ పరిస్థితి దిగజారుతోంది. ఇలాంటి సమయంలో మరో ఐదు రాష్ట్రాల ఎన్నికలు వచ్చాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ముఖాముఖి, కూటములుగా తలపడే పరిస్థితులు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, ఈ ఎన్నికలు ఆ పార్టీ ఉనికికి ,ప్రతిపక్ష కూట ఐక్యతకు అగ్నిపరీక్షగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో మరోసారి తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ తన సంక్షేమ పథకాలు , బెంగాలీ అస్తిత్వంపై నమ్మకం పెట్టుకోగా, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలను బీజేపీ తన ప్రధాన అస్త్రాలుగా మార్చుకుంది. ఇక్కడ కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి పోటీ చేస్తున్నప్పటికీ, ప్రధాన పోటీ మాత్రం టీఎంసీ–బీజేపీ మధ్యే ఉండేలా కనిపిస్తోంది. ముస్లిం ఓట్ల సమీకరణ ఇక్కడ గెలుపోటములను శాసించనుంది. మమతా బెనర్జీ ఎంతో నమ్మకంగా ఉన్నప్పటికీ.. బీజేపీ కూడా గెలిచి చూపిస్తామన్న ధీమాతో ఉంది. తమిళనాడులో అధికార డీఎంకే కూటమి బలంగా ఉన్నప్పటికీ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రాకతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అన్నా డీఎంకే తన కోల్పోయిన వైభవాన్ని చాటుకోవాలని చూస్తుంటే, బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. కాంగ్రెస్ ఇక్కడ డీఎంకేపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. సీట్ల సర్దుబాటు విషయంలో డీఎంకే ఈసారి కఠినంగా వ్యవహరించే అవకాశం ఉండటంతో కాంగ్రెస్‌కు ఇది సవాలుగా మారింది. త్రిముఖ పోరులో డీఎంకేకు లాభం కలుగుతుందన్న అంచనాలు వస్తున్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేశారు. ఇప్పుడు వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవాలని ఎల్‌డిఎఫ్ చూస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కి ఇది చావో రేవో లాంటి ఎన్నిక. ఒకవేళ ఇక్కడ కూడా కాంగ్రెస్ ఓడిపోతే, జాతీయ స్థాయిలో ఆ పార్టీ నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింటుంది. అటు బీజేపీ కూడా క్రైస్తవ ఓటర్లను ఆకట్టుకుంటూ ఇక్కడ బలపడాలని చూస్తోంది. ప్రియాంకా గాంధీ వాయనాడ్ నుంచి ఎంపీగా ఉండటంతో గెలుపు సాధించడం ప్రతిష్టాత్మకంగా మారింది. అసోంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. అభివృద్ధి , హిందుత్వ నినాదాలతో బీజేపీ మూడోసారి అధికారంపై కన్నేసింది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతోంది. పైగా కీలక నేతలు బీజేపీలో చేరడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. ఏఐయుడిఎఫ్ వంటి పార్టీలతో పొత్తులు కుదిరితేనే కాంగ్రెస్ ఇక్కడ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది, లేదంటే బీజేపీకి మార్గం సుగమం అవుతుంది.పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్‌సీ , బీజేపీ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. గతంలో ఇక్కడ కాంగ్రెస్ బలంగా ఉండేది, కానీ నేతల వలసలు ఆ పార్టీని బలహీనపరిచాయి. ఇక్కడ కూడా డీఎంకే మద్దతుతోనే కాంగ్రెస్ తన ఉనికిని చాటుకోవాల్సిన పరిస్థితి ఉంది. చిన్న రాష్ట్రం అయినప్పటికీ, ఇక్కడ గెలుపు కేంద్రంలోని అధికార పార్టీకి ప్రతిష్టాత్మకం.ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకం. కేరళలో అధికారం దక్కించుకోలేకపోతే, ఆ పార్టీ కేవలం కొన్ని చిన్న రాష్ట్రాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు,



బెంగాల్ , తమిళనాడులో ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకేలు గెలిస్తే, ఇండియా కూటమిలో కాంగ్రెస్ ప్రాధాన్యత తగ్గి, మమతా బెనర్జీ , స్టాలిన్ వంటి నేతలు జాతీయ నాయకత్వం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఐదు రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయ గమనాన్ని మార్చనున్నాయి.

# స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్

## తమిళ రాజకీయాల్లో సంచలనం



తమిళనాడు రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం , ప్రస్తుత ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. తమిళనాడు శాసనసభ సమావేశాల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఏఐఏడీఎంకే లో చోటు చేసుకున్న అంతర్గత విభేదాల వల్ల ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఓపీఎస్, తన సొంత వర్గంతో రాజకీయంగా ఒంటరయ్యారు. ఈ క్రమంలో అధికార పక్ష నేతను ఆయన కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తమిళనాడు శాసనసభలో రెండ్రోజుల పాటు జరిగిన తాత్కాలిక బడ్జెట్ చర్చల సందర్భంగా ఓపీఎస్ మద్దతుదారుడు, ఎమ్మెల్యే ఐయ్యప్పన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ము.క. స్టాలిన్ మళ్లీ విజయం సాధించి, తమిళనాడు ముఖ్యమంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. అంతేకాకుండా, పురట్చి తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ జయలలిత ఆశీస్సులతో స్టాలిన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలపడం అందరినీ ఆశ్చర్యపరిచింది. శాసనసభ సమావేశాల ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్, అనంతరం మీడియాతో మాట్లాడారు. డీఎంకే ఐదేళ్ల పాలన అత్యంత అద్భుతంగా ఉందని కొనియాడారు. అందుకే ఉదయాన్నే ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపానని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే మళ్లీ డీఎంకే అధికారంలోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన విశ్లేషించారు. తన మద్దతుదారు ఐయ్యప్పన్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు ప్రజల మనోగతానికి ప్రతిరూపమని ఓపీఎస్ సమర్థించారు. మీరు డీఎంకేలో చేరుతారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఓపీఎస్ స్పందిస్తూ.. కొంతకాలం వేచి చూడండి అని బదులిచ్చారు. ఈ సమాధానం ఆయన పార్టీ మారబోతున్నారనే అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, జయలలిత మరణం తర్వాత ఏఐఏడీఎంకే నుండి బహిష్కరణకు గురైన ఓపీఎస్.. 'ధర్మయుద్ధం' చేసినా, 'హక్కుల పునరుద్ధరణ కమిటీ' పెట్టి పోరాడినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఆయన ప్రధాన అనుచరులంతా ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లో చేరిపోగా, ఇప్పుడు ఆయన వద్ద మిగిలింది కేవలం ఎమ్మెల్యే ఐయ్యప్పన్ మాత్రమే. ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ఓపీఎస్ డీఎంకే వైపు మొగ్గు చూపుతున్నారా అనే సందేహం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. దీనికి సంబంధించిన స్పష్టత అతి త్వరలోనే వచ్చే అవకాశం ఉంది.

# కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్

హైదరాబాద్,ఫిబ్రవరి 22

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రుల బృందం గురువారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగావచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఫోకస్ పెట్టినట్టు స్పష్టం చేసింది. పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. తెలంగాణలో గత రెండేళ్లలో పార్టీ సాధిస్తున్న పురోగతిని సమీక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం, దాదాపు రెండు గంటలపాటు లోతైన చర్చలు జరిపింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు కొని ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ సాధించిన ఫలితాల పట్ల మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని ఖర్గే కొనియాడారు. ఇప్పటి వరకు అన్ని సానుకూలంగా సాగాయని, భవిష్యత్‌లో కూడా ఇదే పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని నాయకత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే మంత్రులు తమ శాఖల పనితీరును, అమలు చేస్తున్న కీలక పథకాలను అధిష్ఠానానికి వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన తీరును మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదిక ఇచ్చారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూభారతి కార్యక్రమం ద్వారా చేపట్టిన భూసర్వే వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకం, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. గిగ్ వర్కర్స్ కోసం ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త విధానం గురించి మంత్రి వివేక్ వివరించగా, ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తీసుకురావాలని రాహుల్ సూచించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సమ్మక్క– సారలమ్మ జాతర నిర్వహణపై రాహుల్ గాంధీ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ జాతర చరిత్ర, ప్రభుత్వం అక్కడ చేపట్టిన కొత్త నిర్మాణాల గురించి తెలుసుకున్న ఆయన, సమ్మక్క–సారలమ్మపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఒక సినిమా తీస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. జాత విజయవంతం కావడంపై అభినందిస్తూ తనను కూడా ఆహ్వానించి ఉంటే వచ్చే వాళ్లమని అన్నారు. పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఢిల్లీ వేదికగా చర్చ జరిగింది. ఇటీవల ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. త్వరలోనే ఆయనను ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని అగ్రనేతలు అన్నట్టు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికల అంశంపై మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో విడిగా చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చాలని హైకమాండ్ ఆదేశించింది. మరోవైపు కరీంనగర్ కార్పొరేషన్ ఫలితాల విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఇచ్చిన వివరణ పట్ల వారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు.

# ఆ ఒక్కరూ ఎవ్వరు...

హైదరాబాద్, ఫిబ్రవరి 22

తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వీతో పాటు, బిఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్. సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఈ రెండు స్థానాల కోసం పోటీ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ సీనియర్ నేతలను వట్టించుకోలేదని, ఈసారైనా పార్టీ విధేయులకు రాజ్యసభర స్థానాలను ఇవ్వాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పార్టీకోసం కష్టపడిన వారికి ఇప్పటి వరకూ ఛాన్స్ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతుంది.శాసనసభలో ప్రస్తుత పార్టీల బలాబలాలను పరిశీలిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకునేలా కనిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల గెలుపు లెక్కల ప్రకారం, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నప్పుడు ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 40 నుంచి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న 64 మంది స్వంత ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీల నుండి చేరిన వారితో కలిపి మొత్తం బలం 75 దాటడంతో, ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడానికి అవసరమైన 82 ఓట్లకు కాంగ్రెస్ అత్యంత సమీపంలో ఉంది. మజ్లిస్ మద్దతు ఎటూ కాంగ్రెస్ పార్టీకే లభిస్తుంది. అందుకే రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందిప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో కొంత ఇబ్బందికరంగానే ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న 27 మంది ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఒక సీటు గెలవడానికి కూడా సరిపోదు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ ఓటింగ్ కు హాజరు కాకపోవచ్చు. పైగా, రెండో ప్రాధాన్యత ఓట్ల విషయంలోనూ అధికార పక్షానికే స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టినా పోటీ ఇవ్వడం కష్టమే. కాంగ్రెస్ అధిష్టానం ఒక సీటును జాతీయ స్థాయి నేతకు, మరో సీటును సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్ర స్థాయి నేతకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఆ ఒక్క సీటు ఎవరికి అన్నది ఇంకా తేలలేదు. జగ్గారెడ్డి మాత్రం వీహెచ్ కు, కుసుమ కుమార్ లకు ఇవ్వాలంటూ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అయితే పార్టీ భవిష్యత్ ప్రయోజనాలు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అంటున్నారు. మరి ఆ ఒక్కరు ఎవరో?



# జెండాలు మోసిన వారికే అగ్రతాంబులం

కాకినాడ, ఫిబ్రవరి 22

జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. పార్టీ సభ్యత్వాల నమోదుతో జనసేన గ్రౌండ్ లెవెల్లో మరింత బలోపేతం అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకున్న వారు జనసేన విజయాలకు పనిచేస్తారన్న విశ్వాసంతో ఉన్నారు. పల్లెలు, పట్టణాల్లో జనసేన క్యాడర్ పెరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేన సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఇప్పటికే జనసేనకు కార్యకర్తల బలం ఉంది. అభిమానుల బలం కూడా జనసేన సొంతం. ఇక సామాజికవర్గం అండదండలు ఎటూ ఉన్నాయి. అదనంగా క్యాడర్ ను పెంచుకునేందుకు పవన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు.స్థానిక సంస్థల ఎన్నికలతో జనసేన రాష్ట్రంలో బలపడాలని చూస్తుంది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించాలంటే స్థానిక నాయకత్వం బలంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది. దీంతో పాటు జనసేనలో ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని చాలా మంది నిరాశలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారిని ఎంపిక చేయడమే ధ్యేయంగా పనిచేయాలని, సుదీర్ఘ కాలం పార్టీలో వారి కున్న హిస్టరీని చూసి ఎంపిక చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారు కూడా ఉన్నారు. 2014 నుంచి పార్టీలోనే ఉంటున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిసింది.జనసేన ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉందని జనసేనాని కూడా గుర్తించారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినప్పటికీ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అందరికీ న్యాయం చేయలేకపోయామని పవన్ కల్యాణ్ చెబుతున్నారు. కానీ పదవి రాని వారు మాత్రం తమకు జనసేనలో గుర్తింపు లేదని బాధపడుతున్నారు. అందుకోసమే ఇకపై ఒరిజినల్ జనసైనికులకు, వీరమహిళలకు నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై ఏ పోస్టు భర్తీ అయినా నామినేటెడ్ పోస్టులను ద్వితీయ శ్రేణి నేతల్లో బాగా కష్టపడిన వారిని గుర్తించి, పార్టీ జెండా మోసే వారికే ప్రయారిటీ ఇచ్చేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. త్వరలోనే అది అమలులోకి తీసుకురానున్నారు. ఇకపై జెండా మోసిన వారికే జై కొట్టనున్నారు.

# మీర్పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో మటన్, చికెన్ షాపులపై దాడులు కుళ్లిపోయిన మటన్ సీజ్

హైదరాబాదుఫిబ్రవరి 22

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్పేట్ మున్సిపల్ సర్కిల్లో మీర్పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో ఉన్న మటన్ మరియు చికెన్ షాపులపై వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా "సైదులు మటన్ ట చికెన్ సెంటర్"లో కుళ్లిపోయిన మటన్ ఫ్రిడ్జ్లో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే సంబంధిత షాపు అవసరమైన లైసెన్స్ లేకపోవడంతో ఆ షాపు సీజ్ చేసి కోర్టుకు పంపించారు.

ఇతర మటన్ మరియు చికెన్ షాపుల్లో కూడా సరైన లైసెన్సులు లేకపోవడం, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వంటి ఉల్లంఘనలు బయటపడటంతో జరిమానాలు విధించారు.

# వాడపల్లి వెంకన్న దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో వేకువ జామునుండే పోటెత్తిన భక్తులు

కొత్తపేట ఫిబ్రవరి 22

చందన స్వరూపుడు స్వయంభూ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం పర్వదినం కావడం తో వాడపల్లిలో స్వయంభూ గా వెలసిన చందన స్వరూపుడు ఏడుశనివారాలు ఏడుప్రదక్షిణలు వెంకన్న బాబుగా ఖ్యాతి గాంచి అశేష భక్త జనంతో మొక్కులు తీర్చుకోవడానికి స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు.

భక్తులు నాలుగు మాడవీధుల గుండా గోవింద నామస్మరణతో ఏడు ప్రదక్షిణలు అనంతరం స్వామిని దర్శించి వారి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ వృద్ధులకు, దివ్యాంగులకు, చంటి బిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేశామని క్యూ లైన్ లో ఉన్న భక్తులకు మంచినీరు, బిస్కెట్లు అందజేస్తున్నామని దర్శనానంతరం భక్తులకోసం ఏర్పాటు చేసిన ఉచిత అన్న ప్రసాదం స్వీకరించాలని ఆఅ కోరారు

# పరిషత్ లు రద్దు దిశగా అడుగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 22

తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో ఈ వ్యవస్థల వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది.రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెస్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను రద్దు చేస్తే, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగిసే అవకాశం ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉన్న ఈ మెట్లను తొలగిస్తే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలో ఉండి ఆ వ్యవస్థలోని భాగాలను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. కాబట్టి ఆయన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తారా లేదా పాలనా సౌలభ్యం కోసం రద్దు వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. ఫిబ్రవరి 23న జరగబోయే కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం ఈ నిర్ణయానికే కట్టుబడితే, ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక పెను మార్పుగా నిలుస్తుం

# జీవన రెడ్డి దారెటు...

కరీంనగర్, ఫిబ్రవరి 22



జగిత్యాల కాంగ్రెస్‌లో సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు ఇప్పుడు కేవలం నియోజకవర్గానికే పరిమితం కావట్లేదు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనంగా మారింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన ఒక సీనియర్ నేత.. నేడు సొంత పార్టీలోనే 'మనుగడ' కోసం పోరాడాల్సి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.తెలంగాణ రాజకీయాల్లో 'క్లీన్ ఇమేజ్' ఉన్న అతికొద్ది మంది నేతల్లో జీవన్ రెడ్డి ఒకరు. కానీ, ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితులు ఒక విధమైన రాజకీయ సంక్షోభాన్ని తలపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, కేడర్ గొంతుకగా నిలిచిన ఆయనకు.. తన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లోకి రావడమే పెద్ద దెబ్బగా మారింది.గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ చేతిలో జీవన్ రెడ్డి ఓడిపోయారు. అయితే, రాజకీయ సమీకరణాల్లో భాగంగా సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం జీవన్ రెడ్డి వర్గానికి మింగుడుపడలేదు. అప్పటి నుండి నియోజకవర్గంలో ప్రోటోకాల్ విషయంలోనూ, అభివృద్ధి పనుల విషయంలోనూ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా జెండాలు మోసిన కార్యకర్తలను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుంటే ఇక మా ఉనికి ఎక్కడ? అనే ప్రశ్న జీవన్ రెడ్డి మద్దతుదారుల నుండి బలంగా వినిపిస్తోంది.ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ఈ విభేదాలను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్గానికి కాకుండా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన నేతకే చైర్మన్ పీఠం అప్పగించడం అగ్నికి ఆజ్యం పోసింది. ఈ క్రమంలో జీవన్ రెడ్డి తన అనుచరులను స్వతంత్రులుగా పోటీ చేయించి గెలిపించుకోవాల్సి రావడం, ఆయన పడుతున్న ఆవేదనకు అద్దం పడుతోంది. "ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి? పార్టీలో నా భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదు" అని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానించడం ఆయన మనస్తాపానికి నిదర్శనం. జీవన్ రెడ్డికి జరుగుతున్న అన్యాయంపై మరో సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. "కష్టకాలంలో పార్టీని వీడని వారికి న్యాయం చేయాలి" అని అధిష్టానాన్ని కోరారు.జగిత్యాల ప్రజల్లో జీవన్ రెడ్డి పట్ల అపారమైన గౌరవం ఉంది. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండే 'మనసున్న నేత'గా ఆయనకు పేరుంది. ఇప్పుడు ఆయన రాజకీయ మనుగడే ప్రశ్నార్థకం కావడం పట్ల స్థానికంగా తీవ్ర సానుభూతి వ్యక్తమవుతోంది. ఒకవేళ జీవన్ రెడ్డి గనుక పార్టీని వీడితే, జగిత్యాలలో కాంగ్రెస్‌కు ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉంది.ఒకవైపు అధికారంలో ఉన్న పార్టీకి ఎమ్మెల్యేల మద్దతు అవసరమే అయినప్పటికీ, దశాబ్దాల చరిత్ర ఉన్న సీనియర్ నేతలను దూరం చేసుకోవడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీ వీడడం అంటే అది కేవలం ఒక నాయకుడిని కోల్పోవడం కాదు, నమ్మకమైన కేడర్‌ను కోల్పోవడమే. వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జీవన్ రెడ్డి ప్రత్యామ్నాయ దారి వెతుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కలుగజేసుకుని, ఈ సీనియర్ వర్సెస్ వలస నేతల గొడవకు స్వస్తి పలకకపోతే జగిత్యాల కోటలో హస్తం పార్టీకి పతనం తప్పకపోవచ్చు.

# ఎమ్మెల్యేలనూ కూడగడుతున్నారా

హైదరాబాదఫిబ్రవరి 22

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి ఆశించిన ఆయన, అది దక్కకపోవడంతో తన అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు. కేవలం అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా, ఒకానొక దశలో ఏకంగా ముఖ్యమంత్రి పదవినే సవాల్ చేసే స్థాయికి ఆయన వ్యాఖ్యలు వెళ్లడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. మంత్రి పదవి ఇవ్వకుంటే తానేంటో చూపిస్తానన్నట్లుగా ఆయన చేస్తున్న హెచ్చరికలు పార్టీలో అంతర్గత పోరును వీధికెక్కించాయి. రాజగోపాల్ రెడ్డి కేవలం మాటలకే పరిమితం కాకుండా, తెరవెనుక పావులు కదుపుతున్నారనే ప్రచారం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. తనకు అనుకూలంగా ఉన్న కొంతమంది ఎమ్మెల్యేలతో ఆయన నిరంతరం చర్చలు జరుపుతున్నారని, అవసరమైతే ఒక వర్గంగా విడిపోయే యోచనలో ఉన్నారని జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తన డిమాండ్లను నెరవేర్చుకోవడమే లక్ష్యంగా ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయన చేస్తున్న విమర్శలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాజగోపాల్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తున్నా, అధిష్టానం ఇప్పటివరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. అయితే, ఇప్పుడు పరిస్థితి చేతులు దాటిపోతోందని, ఆయన ఏకంగా ప్రభుత్వాన్ని బలహీనం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని సంకేతాలు అందడంతో హైకమాండ్ అప్రమత్తమైంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ వ్యవహారాన్ని ఇప్పటికే కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని అధిష్టానం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. రాజగోపాల్ రెడ్డిని పిలిపించి మాట్లాడతామని, ఆయన అభ్యంతరాలు ఏమిటో తెలుసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక రకంగా రాజగోపాల్ రెడ్డికి ఇస్తున్న చివరి హెచ్చరికగా భావించవచ్చు. సర్దిచెప్పే ప్రయత్నాలు విఫలమైతే, పార్టీ లైన్ దాటి వెళ్తున్న నేతపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాన్ని పీసీసీ పంపింది. రాజగోపాల్ రెడ్డిని దారికి తెచ్చేందుకు అధిష్టానం త్వరలోనే ఒక స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రానుంది.రాజగోపాల్ రెడ్డి గతాన్ని పరిశీలిస్తే, ఆయన గతంలో కూడా పార్టీని వీడి మళ్ళీ తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన మళ్ళీ అదే బాట పడతారా లేక మంత్రి పదవి కోసం ఒత్తిడి తంత్రం మాత్రమే ఉపయోగిస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ఆయన శాంతించకపోతే, ఆయనపై వేటు వేయడం ద్వారా ఇతరులకు గుణపాఠం చెప్పాలని రేవంత్ రెడ్డి వర్గం భావిస్తోంది. రాజగోపాల్ రెడ్డి వైఖరి పార్టీకి బలమా లేక బలహీనతా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. సీనియర్ నేతగా ఆయనకున్న బలాన్ని కాపాడుకుంటూనే, ముఖ్యమంత్రి పీఠాన్ని సవాల్ చేసే ధోరణిని అధిష్టానం ఎలా అణచివేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆయన దారికి రాకపోతే, కాంగ్రెస్ తనదైన శైలిలో ఆయనకు దారి చూపించే అవకాశం మెండుగా ఉంది.

# మూగ, చెవుడు చిన్నారికి రూ 7 లక్షల సాయం

విజయవాడ ఫిబ్రవరి 22

మనీ అందరికీ ఉంటుంది.. కానీ ఆపన్న హస్తం అందించే మనస్సు మాత్రం కొంతమందికే ఉంటుంది. అటువంటి వారిలో పవర్ మెక్ ప్రాజెక్టు సంస్థ అధినేతలు సజ్జా లక్ష్మీ, కిషోర్ ముందు వరుసలో ఉంటారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాల ద్వారా చేయూతను ఇచ్చిన వారు.. తాజాగా చెవుడు, మూగతో బాధ పడుతున్న ఓచిన్నారి కి వినిపించేలా, మాటలు తెప్పించేందుకు తమ వంతు బాధ్యతగా 7లక్షల రూపాయలను సాయం అందించారు. విజయవాడ మాచవరం పోలీస్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న దిలీప్ కుమార్ కు పాప, బాబు. ఇద్దరికీ వినికిడి లోపం కారణంగా మాటలు కూడా రాలేదు. తనకు ఉన్న ఆస్తిని అమ్మి అప్పటికే పాపకు ఆపరేషన్ చేయించాడు. బాబుకు కూడా అదే కష్టం రావడంతో.. తల్లిడిల్లిపోయాడు. చికిత్స కోసం తోటి పోలీసులు కొంతవరకు సాయం అందించారు. అయితే ఆపరేషన్ కు 16లక్షలు అవసరం కావడంతో దాతల సాయం కోసం విజ్ఞప్తి చేశారు. ఈ విషయం తెలుసుకున్న విజయవాడ సెంట్రల్ ఏసీపీ దామోదర్ వెంటనే స్పందించారు. పవర్ మెక్ ప్రాజెక్టు సంస్థ అధినేతలు సజ్జా లక్ష్మీ, కిషోర్ లను కలిసి దిలీప్ కు వచ్చిన కష్టం గురించి వివరించారు. ఆ బాబు కి అవసరమైన ఆపరేషన్ కు సాయం అందించాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన వారు ఆ బాబు కి ఆపరేషన్ చేయించేందుకు ఏడు లక్షల రూపాయలు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మాట ఇవ్వడమే కాకుండా నేడు శనివారం ఏసీపీ దామోదర్ సమక్షంలో దిలీప్ కుటుంబ సభ్యులకు సజ్జా లక్ష్మీ ఏడు లక్షల రూపాయల చెక్ ను అందచేశారు. ఏసీపీ గారి ద్వారా తన కష్టం తెలుసుకుని ఏడు లక్షల రూపాయల సాయం అందించిన సజ్జా లక్ష్మీ, కిషోర్ లకు దిలీప్ కృతజ్ఞతలుతెలిపారు. ఏసీపీ దామోదర్ మాట్లాడుతూ పవర్ మెక్ ప్రాజెక్ట్ సంస్థ ద్వారా కిషోర్, లక్ష్మీ లు చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి అనేక మందికి ఆపన్న హస్తం అందిస్తున్నారని, దిలీప్ పరిస్థితి తెలుసుకుని వెంటనే స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# గోదావరి జలాలతో డెల్టా రైతాంగానికి రెండు పంటలకు నీరు :ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము

గుడివాడ రూరల్ ఫిబ్రవరి 22

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పోలవరం నిర్మాణ పనులు చేరుకున్నాయని ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గోదావరి జలాలతో రైతాంగానికి రెండు పంటలకు అందిస్తామని అన్నారు.గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామంలో రూ.23.75 లక్షల నిధులతో పునర్ నిర్మిస్తున్న ఇరిగేషన్ రెగ్యులేటర్ నిర్మాణ పనులను మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలసౌరి, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము భూమి పూజ నిర్వహించి శనివారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఎంపీ,ఎమ్మెల్యేలకు మోటూరు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని భగీరథ మహర్షి విగ్రహానికి పూజలు చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ వల్లభనేని బాలసౌరి మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలను పరిష్కరించడం, రైతాంగానికి స్థిరమైన అయుకట్టు అందించడమే లక్ష్యంగా విరివిగా ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని అన్నారు.పోలవరం నిర్మాణంతో డెల్టాకు సమృద్ధిగా గోదావరి జలాల రాకతో ,రైతాంగం రెండు పంటలతో సుభిక్షంగా ఉంటారని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గుడివాడ నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని ఆయన వెల్లడించారు.ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ కూటమికి మద్దతుగా నిలిచిన మోటూరు గ్రామ అభివృద్ధికి.... కూటమి ప్రభుత్వ హయాంలో రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులు చేసామన్నారు. ఏడేళ్లుగా ప్రయత్నిస్తున్న ఇరిగేషన్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వంలో ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఒక్క మోటూరు గ్రామంలోనే కాకుండా పరిసర గ్రామాల ప్రజలకు త్రాగునీటి, సాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ వేసవి సీజన్లో మోటూరు త్రాగునీటి చెరువును అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు అభివృద్ధి పనులకు ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు అడ్డుపడడం బాధాకరమన్నారు. పార్టీలకంటే గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని కలిసి ఉంటే ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చని, ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గ ప్రజల సమస్యలపై వెళ్లిన ప్రతిసారి తక్షణమే స్పందిస్తూ, సమస్యలను పరిష్కరిస్తున్న సోదరుడు ఎంపీ బాలసౌరీకు గుడివాడ ప్రజల తరఫున ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలిపారు.ఏపీ ఎస్.డబ్ల్యూ.సి చైర్మన్ రావి వెంకటేశ్వర్రావు, గుడివాడ జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాత్రగడ్డ రవికుమార్,టిడిపి అధ్యక్షుడు వాసే మురళి,ఎంపీపీ గద్దె పుష్ప రాణి, ఎండిఓ విష్ణు ప్రసాద్, మండల సర్పంచ్ కూరగంటి పద్మ, ఎంపీటీసీ గొర్రె వరలక్ష్మి,పిఏసిఎస్ చైర్మన్ చీకటి శేషగిరి రావు,కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, జనసేన నాయకులు చందు రెడ్డి, ఇరిగేషన్ డిఈ భరత్, బీసీ చైర్మన్ నానారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చీకటి శేషగిరిరావు, పార్టీ నాయకులు గొర్రె రంగ, గంటా బాలాజీ, చలమలశెట్టి సాయి, గంటా చైతన్య, యార్లగడ్డ తేజ, గంట లక్ష్మణ్, గండికోట పాండు, కటారి ప్రసాదు, కాత్రగడ్డ రాజేష్, ముప్వా నాగేశ్వరరావు, మానేపల్లి సురేష్,ఇరిగేషన్,మండల పరిషత్,పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హాలహర్వి లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం

నందవరం ఫిబ్రవరి 22

మండల పరిధిలో గ్రామాలను అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేద్దామని ఎంపీడీవో పుల్లయ్య పేర్కొన్నారు.మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ముందుగా గ్రామంలో ఈ కార్యక్రమం పై అధికారులు,ప్రజలు ప్రతిజ్ఞ చేశారు.పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తనిఖీ నిర్వహించి,విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే అత్యంత పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారని ఇకపై ప్రతి నెలా మూడవ శనివారాన్ని స్వచ్ఛ దివస్ గా జరుపుకోవాలన్నారు.ప్రతి ఇంటి నుండి వంద శాతం చెత్త సేకరణ చేయాలన్నారు.దానిలో తడి చెత్త,పొడి చెత్త వేరే చేయాలని చెత్త కుప్పలు లేని సమాజం తయారు చేయడమే మన లక్ష్యంగా ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడం మన బాధ్యత కావాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో సందీప్,పంచాయతీ కార్యదర్శి సుజాత,ప్రధానోపాధ్యాయులు బందే నవాజ్,టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, టీడీపి నాయకులు ప్రభుదాసు,నాగరాజు,జగన్నాథ్ రెడ్డి,మణి కుమార్,ఎర్రం నాయుడు,ఆనందు,ఏసేపు,హరి,బుడ్డ రంగన్న,ప్రభాకర్,కాజా,ఉపాధ్యాయులు,తి మ్మప్ప,సచివాలయ సిబ్బంది,అంగన్వాడి కార్యకర్తలు,ఆశ వర్కర్లు,పారిశుధ్య కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ గా రవీంద్రారెడ్డి నియామకం

కొత్తపల్లి: ఫిబ్రవరి 22

వైసీపీ పార్టీ అధ్యక్షులు ఎబ జగన్మోహనరెడ్డి అదేశాల ప్రకారం రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ గారు శ్రీ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గారి, నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త గారి ఆశీస్సులతోనంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామము నకు చెందిన రవీంద్రారెడ్డిని వైసీపీ రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదలచేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి ఎబ జగన్మోహనరెడ్డి ఎందుకు సహకరించిన యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ కృతజ్ఞతలు తెలియజేసారు. పార్టీ బలోపేతానికి కృషితో అందరి సహకారంతో ముందుకు తీసుకెళ్తానని అయన తెలిపారు.

# హెరిటేజ్ సంస్థ పై వైకాపా ఆరోపణలు సరికావు డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

బద్వేలుఫిబ్రవరి 22

హెరిటేజ్ ఫుడ్స్ సంస్థను లక్ష్యంగా చేసుకుని సాక్షి మీడియా వైసీపీ వర్గాలు చేస్తున్న ఆరోపణలు సరైనవి కాదని అందుకే వారు చేస్తున్న దుష్ప్రచారంపై హెరిటేజ్ సంస్థ ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వేసిందని డీసీసీబీ చైర్మన్మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం బద్వేల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు, సంబంధిత ప్రచారాన్ని ఫేక్ ప్రచారం అని గుర్తించినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వార్తలు, సోషల్ మీడియా పోస్టుల లింకులను 24 గంటల్లోగా తొలగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.ఒక ప్రముఖ సంస్థపై ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదని అన్నారు. వైసీపీ నేతలు హెరిటేజ్ ఫుడ్స్ పేరును ఉపయోగించి రాజకీయ లాభం కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం భావ్యం కాదని విమర్శించారు.సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం బాధాకరమని, ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కోర్టు ఆదేశాలను గౌరవించి వెంటనే సంబంధిత వార్తలు, పోస్టులు తొలగించాలని ఆయన కోరారు. హెరిటేజ్ ఫుడ్స్ వంటి సంస్థలు రైతులతో అనుసంధానంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నాయని, వాటిపై రాజకీయ ఆరోపణలు చేయడం విచారకరమని చైర్మన్ పేర్కొన్నారు విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు చెరుకూరి రవికుమార్ డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్ జయరాం రెడ్డి రైల్వే కాంట్రాక్టర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్న డి.ఎస్.పి ప్రమోద్

ఆళ్లగడ్డ ఫిబ్రవరి 22

రంజాన్ మాసం రెండవ రోజు శుక్రవారం ఉపవాస దీక్షల విరమణ అనగా ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాత మసీదు జామియా మర్కస్ మస్జిద్ లో డిఎస్పి ప్రమోద్ ముస్లిం సోదరులతో కలిసి ఆళ్లగడ్డ మండల ప్రభుత్వ ఖాజీ మతపెద్ద పాత మసీదు ఇమామ్ మహమ్మద్ జాఫర్ సాదిక్ మరియు ఆళ్లగడ్డ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి అమీర్ భాష కౌన్సిలర్ ఎస్ హుస్సేన్ భాష ఏఎన్ఆర్ చికెన్ సెంటర్ హుస్సేన్ భాష గౌస్ హజరత్ హకీం మహబూబ్ బాషా ఈనాడు సర్దార్ భాయ్ ట్రెజరర్ పండ్లమండి షర్బుద్దీన్ రెహమాన్ చాక్లెట్ భాష పాల్గొని డిఎస్పి కి సన్మానం చేసి ప్రార్థనలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా డిఎస్పి ప్రమోద్ మాట్లాడుతూ ముస్లిం సోదరులందరికీ రంజాన్ మాసపు శుభాకాంక్షలు తెలుపుతూ రంజాన్ మాసం ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన మాసం ఈ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలో దానధర్మాలు ఐదు పుట్ల నమాజులు ఖురాన్ చదవడం ప్రత్యేకత ప్రత్యేకత అన్నారు. ఆళ్లగడ్డలో అన్ని మతాలవారు హిందూ,ముస్లిమ్స్ మరియు క్రిస్టియన్స్ సోదరా భావంతో ఉండడం పండగ చేసుకోవడం చాలా సంతోషం అన్నారు ముస్లిం సోదరులందరూ స్నేహభావంతో సమాజ హితంతో మెలగాలని సూచించారు ఈ సందర్భంగా మత పెద్ద మహమ్మద్ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ రంజాన్ మాసం అల్లా ఇచ్చిన ఒక గొప్ప వరం ముస్లిం సోదరులకు అలాగే దివ్య ఖురాన్ గ్రంథం ఈ మాసంలో ఉద్భవించడం జరిగిందన్నారు రంజాన్ మాసం లో ముస్లింలు ఉపవాసాలు వలన ఆత్మ శుద్ధి నియంత్రణ దైవచింతన క్రమశిక్షణ సేవాభావము తల్లిదండ్రుల యందు బంధువుల యందు మంచిగా మెలగడం భావాలు కలుగుతాయి అన్నారు.

# అహోబిలంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

అహోబిలం ఫిబ్రవరి 22

284 మద్యం సీసాలు స్వాధీనం, 8 మందిపై చర్యలు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.ఆళ్లగడ్డ డీఎస్పీ కే .ప్రమోద్ ,శనివారం తెల్లవారుజామున అహోబిలంలో ఆళ్లగడ్డ డిఎస్పి కే .ప్రమోద్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ సబ్ డివిజన్ లోని సుమారు 50 మంది సబ్ డివిజన్ అధికారులు మరియు సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (అయూ) నిర్వహించబడింది.

# ఖమ్మంలో రూ.4.50 కోట్ల క్యాంపు కార్యాలయం?

## ఆర్థిక మంత్రిపై విమర్శల వెల్లువ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 భట్టి విక్రమార్క అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణల మధ్య, ఖమ్మం జిల్లాలో రూ.4.50 కోట్ల వ్యయంతో కొత్త క్యాంపు కార్యాలయం నిర్మాణం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే మధిరలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, అలాగే హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఖమ్మంలో మరో ప్రత్యేక క్యాంపు కార్యాలయం అవసరమా అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో కేవలం రూ.1 కోట్ల వ్యయంతో క్యాంపు కార్యాలయం నిర్మించగా, ప్రస్తుత నిర్మాణానికి రూ.4.50 కోట్ల ప్రజా ధనం ఖర్చు చేయడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనం ప్యాలెస్ తరహాలో నిర్మాణం జరుగుతోందని, ఇది ప్రజా ధన వినియోగంలో అసమతుల్యతను సూచిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న చర్చల ప్రకారం, ఖమ్మం జిల్లా తన ఆధిపత్యాన్ని చాటుకునే క్రమంలోనే ఈ నిర్మాణం చేపట్టారని, ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఒక రాజకీయ సందేశం ఇవ్వడానికే ఈ భవనం నిర్మాణమని ప్రచారం సాగుతోంది. అయితే ఈ వ్యాఖ్యలపై అధికారికంగా ఎటువంటి స్పష్టీకరణ వెలువడలేదు.ఇదే సమయంలో పెన్షనర్లకు పెండింగ్ బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలకు నిధుల కొరత ఉందని ప్రభుత్వం పేర్కొంటున్న

నేపథ్యంలో, మంత్రిగారి కోసం భారీ వ్యయంతో భవనం నిర్మాణం చేపట్టడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.అలాగే, ఒక మంత్రికి ఇంత భారీ స్థాయిలో క్యాంపు కార్యాలయం నిర్మిస్తే, ఇతర మంత్రులు కూడా ఇలాంటి సదుపాయాలు కోరితే పరిస్థితి



ఎలా ఉంటుందన్న ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోందని సమాచారం.ఈ అంశంపై ప్రభుత్వం అధికారిక వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

# తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దు.. అసాధ్యమే..!!

హైదరాబాద్, ఫిబ్రవరి 22

తెలంగాణలో స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయాలనే ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలంగాణ ప్రభుత్వ వర్గాలు లీకులు ఇస్తున్నాయి. ప్రస్తుతమున్న ఎంపీటీసీ , జడ్పీటీసీ వ్యవస్థల వల్ల అధికార యంత్రాంగం క్లిష్టంగా మారుతోందని, నిధుల వినియోగంలో జాప్యం జరుగుతోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మధ్యంతర వ్యవస్థలను తొలగించి, గ్రామ పంచాయతీ సర్పంచులకు , జిల్లా స్థాయి యంత్రాంగానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి అనుకుంటున్నారు.

పరిషత్‌లకు చాలా స్వల్పంగానే నిధులు..

ప్రస్తుతం మండల పరిషత్ , జిల్లా పరిషత్ సభ్యులకు కేటాయించే నిధులు చాలా పరిమితంగా ఉంటున్నాయి. అనేక సందర్భాల్లో ఎంపీటీసీలకు కనీస అధికారాలు కూడా ఉండటం లేదనే అసంతృప్తి వారిలో ఉంది. ఈ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా పాలనాపరమైన ఖర్చులను తగ్గించడమే కాకుండా, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మండల వ్యవస్థను కేవలం పరిపాలనా విభాగంగానే ఉంచి, రాజకీయ ప్రాతినిధ్యాన్ని గ్రామ, జిల్లా స్థాయిలకే పరిమితం చేయడం ద్వారా ద్వంద్వ పాలన కు స్వస్తి పలకాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే సాధ్యం కాదు..

ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం అంత సులభమైన విషయం కాదు. భారత రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామ, మండల, జిల్లా స్థాయిలు

అమలులో ఉండాలి. దీనిని మార్చాలంటే రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం , పార్లమెంటు ఆమోదం కూడా అవసరమవుతుంది. కేవలం రాష్ట్ర స్థాయి నిర్ణయంతో రాజ్యాంగబద్ధమైన ఈ వ్యవస్థలను రద్దు చేయడం సాధ్యం కాదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం మొగ్గు చూపితే, దీనిపై సుదీర్ఘమైన న్యాయ పోరాటం జరిగే అవకాశం ఉంది.

కలసి వచ్చే పార్టీలు ఉండవు..

పరిషత్‌ల రద్దు ప్రతిపాదనపై రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం కనిపిస్తోంది. స్థానిక సంస్థల్లో పట్టు సాధించాలనుకునే నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే అవకాశం ఉంది. ముఖ్యంగా విపక్షాలు దీనిని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించే ప్రమాదం ఉంది. అందుకే రేవంత్ ఆలోచన చర్చకు కారణం అవుతుంది కానీ అమల్లోకి రాకపోవచ్చు..!!

# మంగళంపేటలో ధ్వజారోహణంతో ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి, ఫిబ్రవరి 22

ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలుపులిచర్ల మండలం మంగళంపేటలో ప్రసిద్ధిచెందిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి.ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు, గరుడ ధ్వజపటాన్ని ఆలయ ప్రదక్షిణగా తీసుకొచ్చారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 08.00 నుండి 09.00 గంటల మధ్య ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. కాగా, రాత్రి పెద్ద శేష వాహనంపై స్వామివారు విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.

ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు

ఫిబ్రవరి 21 నుండి మార్చి 02 వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం 08.00 గం.ల నుండి 09.00 గం.లకు, సాయంత్రం 06.00 గం.ల నుండి 08.00 గం.ల వరకు వాహన సేవలు జరుగనున్నాయి.శనివారం సాయంత్రం 06.00 గం.లకు స్వామి వారు పెద్ద శేష వాహనంపై విహరించనున్నారు.

వాహన సేవల వివరాలు

ఫిబ్రవరి 22వ తేదీ ఉదయం చిన్న శేష వాహనం, సాయంత్రం హంస వాహనం, 23వ తేదీ ఉదయం ముత్యపు పందిరి వాహనం, సాయంత్రం సింహ వాహనం, 24వ తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమంత వాహనం, 25వ తేదీ ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం 06.00 గం.లకు కల్యాణోత్సవం, రాత్రి 08.00 గం.లకు గరుడ సేవ, 26వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్ర ప్రభ వాహనం, 27వ తేదీ ఉదయం మోహినీ ఉత్సవం, సాయంత్రం గజ వాహనం, 28వ తేదీ ఉదయం 08.00 గం.లకు రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, మార్చి 01వ తేదీన ఉదయం 11.00 గం.లకు చక్ర స్నానం, రాత్రి 07.00 గం.లకు ధ్వజావరోహణం, మార్చి 02వ తేదీ ఉదయం 09.00 గం.లకు పుష్పయాగ మహోత్సవం చేపడుతారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : ఆత్మకూర్ అర్బన్ సీఐ మహేశ్వర్ రెడ్డి

ఆత్మకూరు ప్రతిఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో మంచి ప్రతిభ చూపి ఉన్నతస్థాయి కి రావాలని ఆత్మకూర్ అర్బన్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ పట్టణంలోని ఐఎఐ స్టేడియం లో తైక్వాండో శిక్షణ తీసుకొనే విద్యార్థులు ఇటీవలే నంద్యాల పట్టణంలో జరిగిన 2నిట రాయలసీమ తైక్వాండో ఛాంపియన్షిప్ - 2026 శ్రీనీ పాల్గొని 16 మెడల్స్ సాధించారు.అందులో గోల్డ్ మెడల్ 8, సిల్వర్ 7, బ్రౌంజ్ 1 సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆత్మకూర్ సీఐ అభినందించారు.ఆంధ్రప్రదేశ్ నుండి వెలువడే ప్రతి నోటిఫికేషన్ లో క్రీడాకారులకు 3% రిజర్వేషన్ కలదని అందుకే ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రీడలలో పాల్గొనాలన్నారు.నిత్యం క్రీడాకారులను అన్ని అన్ని విధాల ప్రోత్సాహిస్తున్న ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ను అభినందించారు.రాష్ట్రం లో 8 రకాల క్రీడలను నిర్వహిస్తున్న ఏకైక స్టేడియం ఆత్మకూర్ ఐఎఐ స్టేడియం అని కొనియాడారు.

# "కాకాణి కి మరోసారి పోలీసులు నోటీసులు

నెల్లూరు ఫిబ్రవరి 22

నెల్లూరు సాయిరాం నగర్ లోని మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి నివాసానికి పోలీసులు చేరుకుని మరోసారి నోటీసులు అందజేశారు. - ఫిబ్రవరి 24వ తేదీ నెల్లూరు రూరల్ డిఎస్పి కార్యాలయంలో విచారణకు హాజరు కావలసిందిగా నోటీసులు జారీ చేచేశారు.. ఫిబ్రవరి 14వ తేదీ నాడు కోవూరు స్టేషన్ కి రావాలని నోటీసులు జారీ చేసిన పోలీసులు, అటు పిమ్మట 14వ తేదీ రావాల్సిన అవసరం లేదని, 19 తేదీ నాడు ఇంటి దగ్గరే విచారిస్తామని, రెండోసారి నోటీసులు అందజేశారు ....

- ఫిబ్రవరి 19 తేదీ నాడు కాకాణి ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎదురుచూసినా, పోలీసులు రాకపోవడంతో తన రోజువారి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరలా పోలీసులు ఈరోజు (20 తేది) నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంకి విచారణ రావలసిందిగా నోటీసులు అందజేశారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపి కాంగ్రెస్ నాయకుల మధ్య హై డ్రామా..

హైదరాబాద్, ఫిబ్రవరి 22

ప్రకాశం జిల్లా ఒంగోలులోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపి నాయకుల కాంగ్రెస్ నాయకుల మధ్య హైడ్రామా నెలకొంది. దీనికి ఒంగోలు తాలూకా పోలీసులు బిజెపి పక్షాన నిలబడి కాంగ్రెస్ నాయకుల పై దాడి చేశారని ఎన్ ఐ సి యు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో భాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపి నాయకులు రాహుల్ గాంధీ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి చొరబడే ప్రయత్నం చేస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ నేషనల్ యూత్ నాయకులు బయటకు వచ్చి పీఎం మోడీ కాంప్రమైజ్ అంటూ నినాదాలు చేస్తూ బయటికి వచ్చే

క్రమంలో తాలూకా సిఐ కాంగ్రెస్ పార్టీ యువజన విద్యార్థి సంఘం నాయకుల పై దాడి చేసి కార్యాలయంలో నిర్బంధించారు. అనంతరం బిజీ వైపి నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను తగలబెట్టే ప్రయత్నం చేయగా పోలీసులు ఉన్నారు. ఇదంతా హై డ్రామా అని అక్కడి స్థానికులు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు కాంగ్రెస్ కార్యాలయం ఎదుట వున్న తాలూకా సిఐను "మా వాళ్ళను ఎందుకు కొట్టారని".. బిజెపి నాయకులకు మీరు అండగా ఉన్నారని ప్రశ్నించారు. దీంతో సీఐ బదులిస్తూ మిమ్మల్ని ఎవరు బయటకు రమ్మన్నారని.. మీరు బయటకు వస్తే మేము చూస్తూ ఊరుకోవాలా అంటూ కాంగ్రెస్ విద్యార్థి సంఘ నాయకులకు బదులిచ్చారు.

# వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరంఫిబ్రవరి 22

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల (ఒఖ ఖంఅూ) ఉద్యోగులు తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మెబాట పట్టారు. నియోజకవర్గం లో ప్రాదమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పని చేస్తున్న ఉద్యోగులంతా ముమ్మిడివరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద శిబిరం ఏర్పాటు చేసి నిరవధిక దీక్ష ప్రారంభించారు. పీఆర్సీ ప్రకారం వేతన సవరణలు అమలు చేయాలి. దీర్ఘకాలంగా పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బందిని శాశ్వతీకరించాలి. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ మరియు గ్రాట్యుటీ ప్రయోజనాలు కల్పించాలి. ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ పథకాలను పూర్తిగా అమలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. సేవా నియమావళిని స్పష్టంగా రూపొందించి అమలు చేయాలంటూ, తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేసి ఆమరణ నిరహారదీక్ష చేపడతామని ఉద్యోగులుహెచ్చరించారు..

# శానిటరీ వర్కర్లకు యూనియన్ కార్డులు అందజేత

సత్తెనపల్లి, ఫిబ్రవరి 22

ఆంధ్రప్రదేశ్ మెడికల్ శానిటరీ వర్కర్స్ యూనియన్ ( ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాల శానిటరీ వర్కర్లకు ఏఐటియుసి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్ గుర్తింపు కార్డులను శనివారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఆవరణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస పనికి, కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి వల్లెం లక్ష్మి చెన్నకేశవరావు, యూనియన్ నాయకురాలు భారతి, భవాని, మార్తమ్మ, దేవి, చుక్కమ్మ, రత్నకుమారి, శేఖరు తదితరులు పాల్గొన్నారు.

# మురళీకృష్ణుడిగా నారసింహుడు

## వైభవంగా కొనసాగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు

భారత శక్తి, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (ఫిబ్రవరి 22): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన ఆదివారం స్వామి వారు మురళీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యారాధనల అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించి ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తూర్పు రాజగోపురం ఎదుట స్వామి వారిని అధిష్టింపజేసి ఆలయ ప్రధాన అర్చకులు మరియు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రచార్యులు ఆధ్వర్యంలో మురళీకృష్ణుడి అలంకార విశిష్టతను వివరించారు. సాయంత్రం ఆరాధనల అనంతరం స్వామివారి పొన్నవాహన సేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారిని అందంగా అలంకరించి పొన్న వాహనంపై అధిష్టింపజెసి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన నేడు ఉదయం స్వామివారికి గోవర్ధనగిరిధారి అలంకార సేవ సాయంత్రం సింహ వాహన సేవ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఆలయ ఈవో ఐఏఎస్ భవాని శంకర్, కలెక్టర్ ఎమ్.హనుమంతరావు, ఉప ప్రధానార్చకులు మంగళగిరి నరసింహమూర్తి, శ్రీకాంత్ కుమార్ చార్యులు, అరుణ్ కుమార్ చార్యులు, శ్రీకాంత్ కుమార్ చార్యులు, సిద్ధార్థచార్యులు, వినయ్ కుమార్ చార్యులు, డిఇఓ భాస్కర్ శర్మ,



ఏఈఓ గజవెల్లి రఘు, సూపరింటెండెంట్ సీతారామాచార్యులు, ఇన్చార్జ్ అర్జున్, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా మొదలైన రెండవ దశ “అరైవ్ అలైవ్ -- 2026”కార్యక్రమం ప్రారంభం

## -సురక్షిత ప్రయాణం ప్రతీ పౌరుని బాధ్యత-- జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 22 (భారత శక్తి)నిర్మల్ ప్రజల ప్రాణ భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని ఈరోజు నుండి “అరైవ్ అలైవ్ -- 2026” కార్యక్రమం ప్రారంభమైంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని జిల్లా డా.జి.జానకి షర్మిల తెలిపారు.

అరైవ్ అలైవ్ మొదటి రోజు లో భాగంగా ఈరోజు జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టబడింది. దీనిలో భాగంగా రోడ్డు భద్రతపై ఎస్ హెచ్ ఓ లు, పోలీసు సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించచారు, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో హెచ్చరిక సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై మైక్ ప్రకటనలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. హెల్మెట్ ధరించడం,సీట్‌బెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం నివారణ, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా తెలియ జేశారు.

ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ




సురక్షితంగా ప్రయాణించాలి, “సురక్షితంగా వెళ్లి సురక్షితంగా చేరడం” ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రజలకు తెలియ జేశారు.

# ఎన్ హెచ్ ఎం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ కుమార్ ఎన్నిక

## -కాంగ్రెస్ నేత సమ్మిగౌడ్ చేతుల మీదుగా ఎన్ హెచ్ ఎం క్యాలెండర్ ఆవిష్కరణ



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22 (భారత శక్తి ): ఎన్ హెచ్ ఎం మహబూబాద్ జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ కుమార్ ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ పుట్ట మహేందర్, డాక్టర్ రిక్విద్దీన్ తెలిపారు. ఆదివారం ఎన్ హెచ్ ఎం మహబూబాబాద్‌పట్టణం లోని బాలాజీ గార్డెన్ లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్.హెచ్.ఎం) ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ పల్లెల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారంటే ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల చలువేనని అన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను నిరసనలు వ్యక్తం చేస్తామని అన్నారు. అనంతరం కాంగ్రెస్ నేత సమ్మిగౌడ్ చేతుల మీదుగా ఎన్ హెచ్ ఎం క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం నూతన కమిటీ ప్రధాన కార్యదర్శిగా పున్నం కవిత, కోశాధికారిగా పగిడిపల్లి ఉమాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కందుల నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి శ్రీకాంత్ తదితరుల పేర్లు ప్రకటించారు.

# నేటి యువతరానికి ఆదర్శనీయులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి.

కడప, ఫిబ్రవరి 22(భారత శక్తి) : ఆంగ్లేయుల పాలనపై మొదటి తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తొలితరం స్వాతంత్ర్య వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం అని.. స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్, టూరిజం అధికారి సురేష్ కుమార్ లు సంయుక్తంగా పేర్కొన్నారు.

ఆదివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో టూరిజం ఉ స్టెప్ శాఖల ఆధ్వర్యంలో.. స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభా కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్, టూరిజం అధికారి సురేష్ కుమార్ లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితంలోని పలు అంశాలను వివరించారు.

తన ప్రజల స్వేచ్ఛా జీవనాన్ని కోరుతూ.. బ్రిటిష్ పాలనను అంతమొందించేందుకు తన ప్రాణాలను త్యాగం చేసిన దేశభభక్తుడు, తొలితరం స్వాతంత్ర్య సమరయోధులు అయిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేటి యువతరానికి ఆదర్శనీయం అన్నారు.

నేటి యువతరానికి ఆదర్శ మూర్తి, ప్రాతః స్మరణీయుడు అయిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 24-11-1806లో ఆంధ్ర ప్రదేశ్ లోని కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలం, రూపనగుడి గ్రామంలో జన్మించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 1847 ఫిబ్రవరి 22న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, వీరమరణం పొందిన స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడ గ్రామానికి పాలెగాడు. నరసింహారెడ్డి తనకు రావలసిన భరణాన్ని ఇవ్వకపోవడంతో బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి, అనేక పోరాటాలు చేశాడు. 1846 అక్టోబర్ 6న బ్రిటిష్ సైన్యం ఆయనను పట్టుకుని, 1847 ఫిబ్రవరి 22న ఉరి తీశారు. నరసింహారెడ్డి మరణానంతరం 100 సంవత్సరాలకు



అంటే 1947 ఆగష్టు 15 వ తేదీన మన దేశానికి స్వాతంత్ర్యం లభించింది.

భారతీయులు స్వతంత్రులు, స్వేచ్ఛాజీవులు, శాంత స్వభావులు, సంస్కారవంతులు, ధైర్యశాలులు త్యాగమూర్తులు.. అయితే బానిసలు కారు, భారతీయులు అన్యాయాలను సహించరు అని చెప్పడానికి ప్రత్యక్ష సాక్ష్యం ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి అన్నారు. భారతీయులు విప్లవ వీరులు, తత్వవేత్తలు, దేశభక్తి గలవారని, ఇచ్చిన మాటకు కట్టుబడేవారు అనడానికి ఆయన నిలువెత్తు నిదర్శనం అని వారు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత

## -మున్సిపల్ చైర్‌పర్సన్- మొరిశెట్టి నివేదిత లక్ష్యాది



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 22:

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.హారదేవ్ సింగ్ జి మహరాజ్ జయంతి సందర్భంగా నిరంకారి మిషన్, మున్సిపాలిటీ ల ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ అమృత్‌లో భాగంగా ఆదివారం స్థానిక మినీ ట్యాంక్‌బండ్ వద్ద ‘స్వచ్ జల్-- స్వచ్ మాన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్రాగు నీరు స్వచ్ఛంగా ఉంటేనే ఆరోగ్యం కాపాడబడుతుందని అందుకే ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ కు పాటుపడాలని కోరారు.స్వచ్ జల్, స్వచ్ మాన్ వంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు.సమాజంలో ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరం'' అని చెప్పారు.యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.

ప్రపంచవ్యాప్తంగా ఇదే రోజున నిరంకారి మిషన్ సేవా కార్యక్రమాలు చేపట్టడం విశేషం అని పేర్కొన్నారు. సూర్యాపేట సంయోజక్ కె సరళ మాట్లాడుతూ, మహరాజ్ చూపిన మార్గంలో మానవతా సేవే ముఖ్యమని, మనసు స్వచ్ఛంగా ఉంటే సమాజం కూడా స్వచ్ఛంగా మారుతుందని తెలిపారు.అందుకే ప్రాజెక్ట్ అమృత్ ద్వారా నీటి వనరుల పరిరక్షణకు కృషి చేస్తున్నాం” అని తెలిపారు.ఈ సందర్భంగా సద్దుల చెరువు కట్ట పై చెత్త చెదారం తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో 29 వ వార్డు కౌన్సిలర్ రాపర్తి.భవాని శ్రీనివాస్,ఎన్విర్వాల్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, జవాన్ వేణు, నర్సింహారెడ్డి,ఎం. విద్యాసాగర్, కె. లక్ష్మారెడ్డి, హరీశ్, రాజేశ్, అంజలి, రవి, లక్ష్మీ, నిర్మల, వెంకటేశ్వర్లు తదితరులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలలో నిర్మల్ జిల్లాకు మరిన్ని పతకాలు

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో,ఫిబ్రవరి 22(భారత శక్తి) రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలలో జిల్లాకు ఆదివారం మరిన్ని పతకాలు లభించాయి. రిథమిక్ యోగ అండర్ 14 సబ్ జూనియర్ బాలుర విభాగంలో మాగం చరణ్ కు వెండి పతకం లభించింది. అండర్- 25 విభాగంలో దిలీప్ కు బంగారు పతకం లభించిందని తెలిపారు.



# వరంగల్ వాసికి అత్యుత్తమ పీ హెచ్ డీ డాక్టరేట్ -ఆర్టీసీ డ్రైవర్ కూతురు కి వ్యవసాయ డాక్టరేట్

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఫిబ్రవరి22:




వరంగల్ జిల్లా కేంద్రంలోని హంటర్ రోడ్డు కు చెందిన సాధారణ ఆర్టీసీ డ్రైవర్ కూతురికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ ప్రధానం చేసింది. వరంగల్ జిల్లా కేంద్రంలోని హంటర్ రోడ్డులో గల సంతోషిమాత కాలనీకి చెందిన ఇటికాల లింగయ్య కూతురు ఇటికాల అనూష వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ చేసి గౌరవ డాక్టరేట్ను పొందింది. ఆదివారం హైదరాబాదులోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మెగా స్నాతనోత్సవం 2026 వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆల్దాస్ జానయ్య అధ్యక్షత వహించారు. ఇటికాల అనూష పత్తి విభాగంలో వర్షాధార పత్తి పంటలు సవాళ్లు లాభాలు అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది. ఈ డాక్టరేట్ను అమెరికా కార్నిల్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అంతర్జాతీయ వ్యవసాయరంగా నిపుణుడు ప్రభు పింగాలి ముఖ్యఅతిథిగా హాజరై డాక్టరేట్ ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుండి జన్మించిన తాను గౌరవ డాక్టరేట్ అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు వ్యవసాయంలో నూతన విధానాలు సాగుకు సాంకేతికతను జోడించి అధిక దిగుబడి నాణ్యమైన పంటలు అందించడమే లక్ష్యంగా తాము పరిశోధనలు చేశామని ఆ పరిశోధనలు రైతులకు ఉపయోగపడేలా మరిన్ని పరిశోధనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తన డాక్టరేట్ కు సహకరించిన ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

# రంజిని తాండలో సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

నిర్మల్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 22:సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని రంజిని తాండలో శనివారం భోగ్ బండరో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిగా సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని ఎడ్లబండి పై అలంకరించి గ్రామంలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. గ్రామస్తులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు.



భోగ్ బండరో కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయ పద్ధతుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ బోధనలు, ఆయన చూపిన మార్గం గిరిజన సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తాండా సర్పంచ్ హరిలాల్, గ్రామ నాయకులు, గ్రామంలోని గిరిజనులు తదితరులు పాల్గొన్నారు. వేడుకలు భక్తి, ఆనందోత్సాహాల నడుమ విజయవంతంగా ముగిశాయి.

# సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం తిరిగి ప్రారంభం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 22 (భారత శక్తి) నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ (సోమవారం) నుంచి యథావిధిగా తిరిగి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.



మున్సిపల్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులు సమర్పించదలిచిన వారు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై నేరుగా అధికారులకు తమ దరఖాస్తులను అందజేయవచ్చని పేర్కొన్నారు. జిల్లావాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# నేటి నుండి రెండవ దశ అరైవ్ అలైవ్ -- 2026" ఉద్యమం ప్రారంభం

-రోడ్డు ప్రమాదాల తగ్గింపే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం:జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,ఫిబ్రవరి 22 (భారత శక్తి ): ఆదివారం నుండి వారం రోజుల పాటు జిల్లాలో ప్రజల ప్రాణ భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని లి"అరైవ్ అలైవ్ -- 2026"లి(2వ దశ) కార్యక్రమం ఓ ఉద్యమం లా విస్తృతంగా నిర్వహించబడుతుంది.




ఈ కార్యక్రమం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించ బడుతుంది.ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో వారం రోజుల పాటు అన్ని పోలీసు స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సురక్షిత ప్రయాణం అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమంలో ముఖ్య లక్ష్యంగా తీసుకోబడింది.

క్యాంపెయిన్ తేదీలు:

22 ఫిబ్రవరి 2026 నుంచి 28 జనవరి 2026 వరకు మొత్తం 7 రోజుల పాటు జరగనున్నాయి.

రోడ్డు భద్రత పై రోజు వారీ అవగాహన కార్యక్రమాలు:

ఆదివారం--1(22.02.2026) : ప్రచారం ప్రారంభం,అవగాహన దినం

రోడ్డు భద్రత పై సిబ్బంది బ్రీఫింగ్, సైన్‌బోర్డులు ఏర్పాటు, ప్రజలకు ప్రకటనలు

సోమవారం--2(23.02.2026) : లేన్ డిసిప్లిన్ డ్రైవ్ దినం

తప్పుగా ఓవర్‌టేకింగ్ తనిఖీ, ఎడమ లేన్ డ్రైవింగ్ అమలు చేయడం

మంగళవారం--3(24.02.2026): హెల్మెట్ అమలు కార్యక్రమం

హెల్మెట్ తనిఖీ డ్రైవ్‌లు, పాఠశాలలు/మార్కెట్ల వద్ద అవగాహన

బుధవారం--4(25.02.2026):సీట్‌బెల్ట్ అమలు కార్యక్రమం దినం

ప్రధాన కూడళ్లలో నాలుగు చక్రాల వాహనాల తనిఖీలు

గురువారం--5(26.02.2026): మద్యం సేవించి వాహనం నడపడం నిరోధ దినం

రాత్రి పూట ప్రత్యేక డ్రైవ్‌లు, బ్రెత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తారు.

శుక్రవారం--6(27.02.2026): కంటి పరీక్ష శిబిరాల దినం

భారీ వాహన డ్రైవర్లకు శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, కళ్లజోళ్లు పంపిణీ

శనివారం--7(28.02.2026): డిఫెన్సివ్ డ్రైవింగ్ అవగాహన ఉ ముగింపు దినం

అవగాహన సమావేశాలు, పీపీటీ కార్యక్రమాల నిర్వహణ జరుగుతుందని జిల్లా ఎస్పీ ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

# పట్టణంలో లోవోల్టేజి సమస్య లేకుండా చేస్తా:మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్

భారత శక్తి, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (ఫిబ్రవరి 22): యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో విద్యుత్ సమస్య, లోవోల్టేజి సమస్యలు రాకుండా చూస్తానని మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో కొబ్బరికాయల కోట దగ్గర ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం పురపాలక సంఘం కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కౌన్సిల్ సభ్యులు తమ తమ వార్డులోని విద్యుత్ సమస్యలపై విద్యుత్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ బరిగే రమ్య రాంచందర్, మున్సిపల్ కమిషనర్ ఎం.లింగస్వామి, కౌన్సిలర్లు బోడ రాధ సురేష్, బూడిద మధు, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, బిట్టు సరోజ హరీష్, కర్రె మాధవి ప్రవీణ్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్, పేరబోయిన సత్యనారాయణ, సాదునేని ధనలక్ష్మి మధుకర్, ముక్కెర్ల మల్లేష్, బబ్బురి శ్రీధర్, ఏఈ సురేందర్ నాయుడు, కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి, పల్లపు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి కార్యక్రమం యధాతధం: జిల్లా కలెక్టర్- తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 22:

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నుండి జిల్లాలోని సూర్యాపేట లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో యధాతధంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని, తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.



# ఇచ్చిన మాట నెరవేర్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

## -పేదల సొంత ఇంటి కలను సాకారం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్
## -ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 22:

సూర్యాపేట మండలంలోని కాసరబాద గ్రామానికి చెందిన దుండిగల రాములు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి పదేళ్లు ఊరించిన గత ప్రభుత్వం ఒక్కరికైనా పక్కా ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని గుర్తుచేశారు. ప్రతీ ఏడాది నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున మంజూరు చేసి ప్రతి పేదోడికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు.రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే నిదర్శనమని, రాబోయే ఎన్నికల్లో కూడా ఇదే ఫలితాలు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.



# వటపత్రశాయి అలంకారంలో నారసింహుడు వైభవంగా కొనసాగుతున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు

భారత శక్తి, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (ఫిబ్రవరి 21):యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన శనివారం స్వామి వారు వటపత్రశాయి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యారాధనల అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించి ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తూర్పు రాజగోపురం ఎదుట స్వామి వారిని అధిష్ఠింపజేసి ఆలయ ప్రధాన అర్చకులు మరియు స్థానాచార్యులు కాందూరి వెంకటాచార్యులు, సురేంద్రచార్యులు ఆధ్వర్యంలో వటపత్ర శాయి అలంకార విశిష్టతను వివరించారు. సాయంత్రం ఆరాధనల అనంతరం స్వామివారి హంస వాహన సేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారిని అందంగా అలంకరించి హంస వాహనంపై అధిష్టింపజెసి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన నేడు ఉదయం స్వామివారికి శ్రీకృష్ణ అలంకార సేవ సాయంత్రం పొన్న వాహన సేవ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఆలయ ఈవో ఐఏఎస్ భవాని శంకర్, కలెక్టర్ ఎమ్.హనుమంతరావు, ఉప ప్రధానార్చకులు మంగళగిరి నరసింహమూర్తి, శ్రీకాంత్ కుమార్ చార్యులు, అరుణ్ కుమార్ చార్యులు, శ్రీకాంత్ కుమార్ చార్యులు, సిద్ధార్థచార్యులు, వినయ్ కుమార్ చార్యులు, డిఇఓ భాస్కర్ శర్మ, ఏఈఓ గజవెల్లి రఘు, సూపరింటెండెంట్ సీతారామాచార్యులు, ఇన్చార్జ్ అర్జున్, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ మాణిక్ ప్రభు, సిబ్బంది మోహన్ రెడ్డి, రామ్మోహన్ రావు, సందీప్ రెడ్డి, సునీల్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఏప్రిల్ 19న 4వ తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్న పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా

హైదరాబాద్, ఫిబ్రవరి 21(భారత శక్తి ):పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పి.ఆర్.ఎస్.ఐ), హైదరాబాద్ చాప్టర్, 4వ తెలంగాణ రాష్ట్ర ప్రజా సంబంధాల సమావేశాన్ని ఏప్రిల్ 19, 2026న హైదరాబాద్‌లో నిర్వహించనుంది. ఈ సమావేశం "తెలంగాణ రైజింగ్ 2047: కమ్యూనికేషన్, ఇన్నోవేషన్ మరియు సాధికారత" అనే ఇతివృత్తంతో నిర్వహించబడనుంది.

బహుళ నేపథ్య సెషన్‌లుగా విస్తరించి ఉన్న ఈ ఒకరోజు సమావేశం, కమ్యూనికేషన్ వ్యూహాలు, విధాన కమ్యూనికేషన్, సాంకేతిక స్వీకరణ, మీడియా ఆవిష్కరణ, స్టార్టప్ సంస్కృతి, పర్యాటకం మరియు సంస్కృతి, బ్రాండ్ నిర్మాణం, యువత ఉపాధి మరియు ప్రజలపాత్ర వంటి కీలక రంగాలపై దృష్టి సారిస్తుంది.ఈ సమావేశంలో భాగంగా, తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న సంస్థల నుండి తెలంగాణ ప్రజా సంబంధాల అవార్డులకు ఈ క్రింది విభాగాల కింద నామినేషన్లను ఆహ్వానిస్తున్నారు:

-డిజిటల్ పిఆర్ ఉ సోషల్ మీడియా కమ్యూనికేషన్
- క్రయసిసి మ్యానేజ్మెంట్ / రెపుటేషన్ మ్యానేజ్మెంట్
- కాంట్రిబ్యూషన్ టూ కమ్యూనిటీ / కార్పొరేట్ వాలంటీరింగ్
- ఇంటర్నల్ కమ్యూనికేషన్ ఎంప్లాయీ ఎంగేజిమెంట్
-మార్కెటింగ్ కమ్యూనికేషన్స్
-మీడియా రిలేషన్స్ /ఇన్ఫ్లుయెన్సర్ క్యాంపైన్స్
- సి.ఎస్.ఆర్ మరియు ఈ.ఎస్.జి క్యాంపైన్స్
- డిజిటల్ / సోషల్ మీడియా క్యాంపైన్స్
- ఈవెంట్ మేనేజ్మెంట్ / ఎక్స్ పిరిమెంటల్ మార్కెటింగ్
-పి.ఆర్ క్యాంపైన్ ఆఫ్ ది ఇయర్ - తెలంగాణ;
- కార్పొరేట్ వీడియో ప్రొడక్షన్
- హౌస్ జర్నల్స్ / న్యూస్ లెటర్స్ వార్తాలేఖలు
- కార్పొరేట్ వెబ్‌సైట్‌లు
- ఇ-జైన్‌లు / బ్లాగ్స్

౿ కాఫీ టేబుల్ బుక్స్ , వాల్ క్యాలెండర్లు, డైరీలు, బ్రోచర్లు మరియు ఆన్యువల్ రిపోర్ట్స్ వంటి కార్పొరేట్ ప్రచురణలు

సమర్పించిన ఎంట్రీలు జనవరి 1, 2024 నుండి డిసెంబర్ 31, 2025 మధ్య కాలంలో జరిగిన పనితీరుకు సంబంధించినవి అయి ఉ ండాలి. అవార్డు ఎంట్రీలను సమర్పించడానికి చివరి తేదీ మార్చి 15, 2026.

ఈ సమావేశానికి పి.ఆర్.ప్రాక్టీషనర్లు, కార్పొరేట్ కమ్యూనికేషన్ నిపుణులు, మీడియా నిపుణులు, ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు, ఆవిష్కర్తలు, పరిశ్రమ నాయకులు, యువ కమ్యూనికేషన్ ఆశావహులు మరియు విద్యార్థులు ప్రతినిధులుగా నమోదు చేసుకోవాలని ఆహ్వానించబడ్డారు.ఆసక్తితో పాల్గొనదలచినవారు మరిన్ని వివరాలకు 98493 21641 / 98665 82101 / 99480 77535 నంబర్లలో సంప్రదించగలరు.యాదృచ్ఛికంగా, పి.ఆర్.ఎస్.ఐ హైదరాబాద్ చాప్టర్ 1988, 2000 మరియు 2019లో 3 అఖిల భారత ప్రజా సంబంధాల సమావేశాలను నిర్వహించింది; 1980 మరియు 2013 మధ్య 12 ఆంధ్రప్రదేశ్ ప్రజా సంబంధాల సమావేశాలను నిర్వహించింది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత, చాప్టర్ 2017, 2018 మరియు 2022లో3 తెలంగాణ రాష్ట్ర ప్రజా సంబంధాల సమావేశాలను విజయవంతంగా నిర్వహించింది.






# రెండేండ్లు వెయిట్ చేసి..

విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఇంటెన్స్ పార్టీ థ్రిల్లర్ కల్ట్. నిన్న ఈ చిత్ర టీజర్ రిలీజ్ సందర్భంగా సంగీత దర్శకుడు రవి బస్రూరుకు విశ్వక్ విలువైన బహుమతి ఇచ్చాడు. అత్యంత ఖరీదైన రోలెక్స్ గోల్డ్ వాచ్ ఇచ్చి పాదాభివందనం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫలక్ నుమా దాస్ తీయక ముందు ఏదైనా సాధించాలన్న కలితో ఉండేవాడినని చెప్పాడు. కల్ట్ కు ముందు ఆ కసి పదింతలు అయిందట. అంత కసితో తీసిన మూవీ అని తెలిపాడు. సినిమాకు ఒక కన్ను తరుణ్ భాస్కర్ అయితే, మరొక కన్ను మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ అని పేర్కొన్నాడు. డిఫరెంట్ మ్యూజిక్ ఇచ్చాడని, అది బాగా నచ్చడంతో రెండేళ్లు వెయిట్ చేసి మరీ రోలెక్స్ గోల్డ్ వాచ్ తెప్పించానని ఆయనే స్వయంగా వాచ్‌ని రవి బస్రూర్ చేతికి తొడిగాడు.

# పుట్టినిల్లు.. మెట్టినిల్లు



భారతీయ సినీ రంగం నుంచి గ్లోబల్ స్థాయికి ఎదిగిన అరుదైన నటీమణుల్లో ప్రియాంక చోప్రా ఒకరు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె 2000 సంవత్సరంలో మిస్ వరల్డ్ కిరీటం అందుకుని గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో అడుగుపెట్టి వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. అందం, నటన, ఆత్మవిశ్వాసం కలయికగా తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఇన్నాళ్ల కెరీర్ తర్వాత ఆమె తొలిసారి తెలుగులో నేరుగా సినిమా చేస్తుంది. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కుతోన్న వారణాసి మూవీలో ఆమె మందాకిని అనే పవర్‌ఫుల్ రోల్ పోషిస్తోంది. మరోవైపు ఆమె నటించిన హాలీవుడ్ చిత్రం ది బ్లఫ్ ఈ నెల 25న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మనసులోని భావాలను పంచుకుంది. బాలీవుడ్ తనకు పుట్టినిల్లు అయితే హాలీవుడ్ మెట్టినిల్లు అని పేర్కొంది. రెండింట్లో దేన్నీ వదల్లేనని స్పష్టం చేసింది. రెండు పరిశ్రమల పని విధానాలు, సంస్కృతులు వేర్వేరుగా ఉంటాయని, ఆ భిన్న అనుభవాలే తనకు నటిగా కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని చెప్పింది.


వరలక్ష్మీ శరత్ కుమార్

## ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు

**: వరలక్ష్మి శరత్ కుమార్**

తన విలక్షణ నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న నటి వరలక్ష్మి శరత్‌కుమార్. సీనియర్ నటుడు శరత్ కుమార్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి వచ్చిన వరలక్ష్మి... ఆ తర్వాత ఇండస్ట్రీలో తన కాళ్లపై తాను నిలబడింది. ఇప్పుడు దర్శకురాలిగా తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. డైరెక్టర్ గా తన మొదటి చిత్రం 'సరస్వతి'తో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ... "డైరెక్టర్ గోపీచంద్ మలినేని సార్ నా గురువు, మెంటార్, గైడ్. ఆయన కారణంగానే నేను ఈ రోజు ఇక్కడ ఉన్నాను. ఆయనే నాకు సెకండ్ లైఫ్ ఇచ్చారు" అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఇండస్ట్రీలో అమ్మాయిలు సర్వైవ్ అవడం చాలా కష్టమని, వారికి సపోర్ట్ ఇవ్వాలని ఆమె కోరింది. కనబడకుండా పోయిన కూతురి కోసం ఒక అమ్మ ఎంత దూరం వెళుతుందో చూపించే కథాంశంతో 'సరస్వతి' తెరకెక్కుతోంది. ఈ సినిమాలో వరలక్ష్మితో పాటు ప్రియమణి, ప్రకాశ్ రాజ్ తదితరులు నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. దోసా డైరీస్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## ఒకరోజు ముందే శ్రీవిష్ణు 'విష్ణు విన్యాసం'... రిలీజ్ డేట్ మార్పు




యంగ్ హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా 'విష్ణు విన్యాసం' విడుదల తేదీ మారింది. ముందుగా ప్రకటించిన దానికంటే ఒక రోజు ముందే ఈ ఫన్ ఎంటర్‌టైనర్‌ను థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఫిబ్రవరి 28న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని, ఇప్పుడు ఫిబ్రవరి 27, శుక్రవారం నాడు రిలీజ్ చేయనున్నారు. నిజానికి ఫిబ్రవరి 27న శ్రీవిష్ణు నటించిన మరో సినిమా 'మృత్యుంజయ' విడుదల కావాల్సి ఉంది. అయితే, ఆ క్రైమ్ థ్రిల్లర్ వాయిదా పడటంతో ఆ తేదీ ఖాళీ అయింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ, బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ రాబట్టేందుకు 'విష్ణు విన్యాసం' చిత్రాన్ని ఒకరోజు ముందుకు జరిపారు. ఈ విషయాన్ని హీరో శ్రీవిష్ణు తన సోషల్ మీడియాలో సరదాగా ప్రకటించారు. "జాతకం ప్రకారం... ఈ 27th FEBRUARY నుంచి థియేటర్లలో నవ్వుల వర్షం కురుస్తుంది. మీ జాతకంలో "NonStop Fun Dosham" మొదలవుతుంది" అంటూ ఫన్నీ పోస్ట్ పెట్టారు. యదునాథ్ మారుతి రావు దర్శకత్వం వహిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో శ్రీవిష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. మూఢనమ్మకాలు, జాతకాలను ఎక్కువగా నమ్మే యువకుడిగా శ్రీవిష్ణు పాత్ర ఆసక్తికరంగా ఉండనుంది. ఈ చిత్రంలో సత్య, మురళీ శర్మ, బ్రహ్మాజీ ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, రాధన్ సంగీతం అందిస్తున్నారు. ఫిబ్రవరి 25న యూఎస్‌లో ప్రీమియర్ షోలు కూడా ప్రదర్శించనున్నారు.

### ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ సౌత్

# బెస్ట్ యాక్టర్ అల్లు అర్జున్



ఉత్తమ నటి నివేదా థామస్
'కుర్చీ మడతపెట్టి' పాటకు 2 పురస్కారాలు
కొచ్చి వేదికగా అట్టహాసంగా వేడుక
సందడి చేసిన సినీ ప్రముఖులు




కేరళ రాష్ట్రం కొచ్చి వేదికగా 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ (సౌత్) ప్రదానోత్సవం నిన్న రాత్రి అట్టహాసంగా జరిగింది. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. అల్లు అర్జున్(పుష్ప 2) బెస్ట్ యాక్టర్ గా పురస్కారాన్ని అందుకున్నాడు. తద్వారా 7 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్న టాలీవుడ్ హీరోగా ఆయన నిలిచాడు. ఉత్తమ నటిగా నివేదా థామస్ (35 చిన్న కథ కాదు), 'గుంటూరు కారం' సినిమాలోని 'కుర్చీ మడతపెట్టి' పాట పాడిన శ్రీకృష్ణ బెస్ట్ మేల్ సింగర్ గా.. ఆ పాటకి డ్యాన్స్ కంపోజ్ చేసిన శేఖర్ మాస్టర్ కి బెస్ట్ కొరియోగ్రాఫర్ గా అవార్డులు వరించాయి. 2024 ఏడాదికి గాను అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులు పురస్కారాలు అందుకున్నారు.

### అవార్డుల విజేతలు వీరే

**బెస్ట్‌మూవీ:** పుష్ప 2
**ఉత్తమ దర్శకుడు:** సుకుమార్ (పుష్ప 2)
**బెస్ట్‌యాక్టర్:** అల్లు అర్జున్ (పుష్ప 2)
**ఉత్తమ నటి:** నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
**బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్:** దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప 2)
**ఉత్తమ సహాయ నటుడు:** అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ)
**ఉత్తమ సహాయ నటి:** అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
**బెస్ట్ డెబ్యూ ఫిమేల్:** నయన్ సారిక (గం గం గణేశా)
బెస్ట్ డెబ్యూ మేల్ సందీప్ సరోజ్ (కమిటీ కుర్రోళ్లు)
బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
**బెస్ట్ లిరిక్స్:** రామజోగయ్యశాస్త్రి (చుట్టమల్లె: దేవర)
**ఉత్తమ గాయకుడు:** శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టి: గుంటూరు కారం)
**ఉత్తమ గాయని:** శిల్పారావు (చుట్టమల్లె)
**బెస్ట్ కొరియోగ్రఫీ:** శేఖర్ మాస్టర్ (కుర్చీ మడతపెట్టి)
**బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్:** రామకృష్ణ మోనిక (పుష్ప 2) & నితిన్ జిహానీ (కల్కి 2898 ఏడీ)
**ఉత్తమ చిత్రం (క్రిటిక్స్):** లక్కీ భాస్కర్
**ఉత్తమ నటుడు (క్రిటిక్స్):** తేజ సజ్జా (హనుమాన్)
**ఉత్తమ నటి (క్రిటిక్స్):** కాజల్ అగర్వాల్ (సత్యభామ)

# సమంత 'మా ఇంటి బంగారం' వచ్చేది అప్పుడే!

ప్రముఖ నటి సమంత నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదల తేదీ ఖరారైంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాను ఈ ఏడాది మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ విషయాన్ని సమంత స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కొత్త పోస్టర్‌లో సమంత ఓ తలుపు చాటు నుంచి ఆసక్తిగా తొంగిచూస్తూ కనిపించారు. ఈ పోస్టర్‌ను పంచుకుంటూ, "ఈ వేసవిలో థియేటర్లలో కలుద్దాం, బంగారాలు.. మే 15న 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలవుతోంది" అని ఆమె క్యాప్షన్ జోడించారు. నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను జనవరిలో విడుదల చేయగా మంచి స్పందన వచ్చింది. బస్సులో బ్రౌన్ కలర్ చీరలో నిలబడి, పోరాటానికి సిద్ధమైనట్లుగా ఉన్న సమంత లుక్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమా గురించి సమంత మాట్లాడుతూ, "ఇది కుటుంబానికి ప్రాధాన్యతనిచ్చే ఎమోషనల్ కథ. ఒక మహిళ బలం ఆమె ధైర్యం నుంచే కాదు, బలహీనత నుంచి కూడా వస్తుందని ఈ చిత్రం చెబుతుంది. ఈ పాత్రలో నటించడం, నిర్మాతగా ఈ సినిమాను









# ప్రపంచానికి బౌద్ధ ధమ్మమే దిక్సూచి

* హస్తినాపురంలో 'శాంతి పాదయాత్ర'కు ఘన స్వాగతం
* అంబేడ్కర్ విగ్రహానికి బౌద్ధ భిక్షువుల నివాళి

వనస్థలిపురం, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : అణు యుద్ధాల భయం, ఆర్థిక అసమానతలు, వివక్షలతో అట్టుడుకుతున్న ఆధునిక ప్రపంచానికి బుద్ధుని బోధనలే శరణ్యమని సామాజికవేత్త చెన్నోజు శ్రీనివాసులు పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని బౌద్ధ క్షేత్రం నుండి తెలంగాణలోని నాగార్జున సాగర్ వరకు చేపట్టిన 'ప్రపంచ బౌద్ధ (ధమ్మ) శాంతి పాదయాత్ర' ఆదివారం హస్తినాపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి బౌద్ధ భిక్షువులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**శాంతియుత సమాజమే లక్ష్యం**

అనంతరం జరిగిన సభలో శ్రీనివాసులు మాట్లాడుతూ.. బుద్ధుని ఆలోచనలు కేవలం వ్యక్తిగత నైతికతకే పరిమితం కాకుండా, సామాజిక న్యాయం మరియు అంతర్జాతీయ శాంతిని కాపాడే శక్తిని కలిగి ఉన్నాయన్నారు. "బౌద్ధ ధమ్మం ఎంత విస్తృతంగా వ్యాపిస్తే, ప్రపంచం అంతగా యుద్ధాలకు దూరమై మానవీయ విలువలకు దగ్గరవుతుందని అంబేడ్కర్ ఆనాడే చాటిచెప్పారు" అని ఆయన గుర్తు చేశారు. నేటి క్లిష్ట పరిస్థితుల్లో బౌద్ధ తత్వం ప్రపంచానికి అత్యంత అవసరమని ఉద్ఘాటించారు.

**450 కిలోమీటర్ల మేర పాదయాత్ర**

గుల్బర్గా నుండి నాగార్జున సాగర్ వరకు సుమారు 450 కిలోమీటర్ల మేర సాగుతున్న ఈ పాదయాత్రలో వివిధ దేశాల నుండి వచ్చిన బౌద్ధ భిక్షువులు, అంబేద్కరిస్టులు, బహుజన వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. హస్తినాపురంలో ఈ యాత్రకు భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ విభాగం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఘనంగా ఆతిథ్యమిచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు పరంధాములు, గోరేటి గణేష్, నూకల నరసింహ, చేపూరి శంకర్, సాయికుమార్, బొట్టు రమేష్, తాటి ఎల్లయ్య తదితరులు పాల్గొని పాదయాత్రకు తమ మద్దతు తెలిపారు.

# రంగారెడ్డి జిల్లాలో అక్రమ డిప్యుటేషన్ల రద్దు

* డీఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు టీచర్లు మాతృ పాఠశాలలకు..
* బీసీ సంక్షేమ సంఘం ఫిర్యాదుతో విద్యాశాఖ ఉన్నతాధికారుల చర్యలు



మేకపోతుల నరేందర్ గౌడ్
తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

రంగారెడ్డి జిల్లా ఫిబ్రవరి 22 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ డిప్యుటేషన్లపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కార్యాలయంలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లను తక్షణమే వారి సొంత పాఠశాలలకు పంపుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**వివరాల్లోకి వెళ్తే..**

కొత్తూరు మండలం మల్లాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న లక్ష్మీనరసింహులు, సరూర్ నగర్ మండలం బహదూర్‌గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న బాదం వెంకటేష్‌లను ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే డీఈఓ పి.సుశీందర్ రావు తన కార్యాలయంలో డిప్యుటేషన్‌పై నియమించుకున్నారు. నిబంధనల ప్రకారం బోధన చేయాల్సిన ఉపాధ్యాయులను కార్యాలయ పనులకు వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

**ముఖ్యమంత్రికి ఫిర్యాదు:**

ఈ అక్రమ డిప్యుటేషన్లపై తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిబంధనలను అతిక్రమించి ఉపాధ్యాయులను ఆఫీసు పనులకు కేటాయించడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డితో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఆయన లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

**దిద్దుబాటు చర్యలు;**

నరేందర్ గౌడ్ ఫిర్యాదుపై స్పందించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అక్రమ డిప్యుటేషన్లు నిజమేనని తేలడంతో, సదరు ఉపాధ్యాయులను వెంటనే వారి మాతృ పాఠశాలలకు రిలీవ్ చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి పి.సుశీందర్ రావు ఆ ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లను విధులనుంచి తొలగించి, తిరిగి వారి స్కూళ్లకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# కబ్జా కోరల నుంచి విముక్తి.. కొండాపూర్‌లో విద్యా కుసుమాలు!

* హైడ్రా దూకుడు: ఆక్రమణల తొలగింపు వెంటే ప్రభుత్వ కళాశాలకు సన్నాహాలు
* హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు.. క్షేత్రస్థాయిలో కమిషనర్ రంగనాథ్ పరిశీలన

హైదరాబాద్ ఫిబ్రవరి 22 భారతశక్తి: ఐటీ కారిడార్‌కు గుండెకాయ వంటి కొండాపూర్ ప్రాంతంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన భూఆక్రమణలపై 'హైడ్రా' (HYDRA) ఉక్కుపాదం మోపింది. విలువైన ప్రభుత్వ భూములను కబ్జాదారుల చెర నుంచి విడిపించడమే కాకుండా, తక్షణమే అక్కడ ప్రజా ప్రయోజనార్థం విద్యాసంస్థల నిర్మాణానికి ప్రభుత్వం అడుగులు వేయడం విశేషం. శనివారం అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు, ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించి కళాశాల ఏర్పాటుకు అవసరమైన సర్వేను చేపట్టారు.

**ఏళ్ల నాటి నిరీక్షణకు తెర..**

శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ సర్వే నంబరు 78 నుంచి 93 పరిధిలోని రాజరాజేశ్వరి నగర్ కాలనీలో 1993లో లేఅవుట్ వేశారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరం, పార్కులు మరియు కమ్యూనిటీ హాల్ కోసం భారీగా స్థలాలను కేటాయించారు. అయితే, గత కొంతకాలంగా





ఈ స్థలాలు బడా బాబుల చేతుల్లో ఆక్రమణకు గురవుతున్నాయి. దీనిపై కాలనీ సంక్షేమ సంఘం 'ప్రజావాణి'లో హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో యంత్రాంగం వేగంగా స్పందించింది.

**యుద్ధ ప్రాతిపదికన చర్యలు**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆదివారం ఘటనా స్థలాన్ని సందర్శించారు.

* ఫెన్సింగ్ ఏర్పాటు: ఆక్రమణలు తొలగించిన వెంటనే భూమి చుట్టూ రక్షణ కవచంలా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.
* విద్యాశాఖ సర్వే: కేటాయించిన స్థలంలో ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి విద్యాశాఖ అధికారులు ఆదివారమే సర్వే ప్రక్రియను ప్రారంభించడం గమనార్హం.
* వసతుల కల్పన: పార్కులకు కేటాయించిన చోట పార్కులు, పాఠశాల స్థలంలో విద్యాసంస్థల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

"దశాబ్దాల కాలంగా ఆక్రమణదారుల చెరలో ఉన్న స్థలం గంటల వ్యవధిలో విముక్తి పొందడం నమ్మశక్యంగా లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఇక్కడ విద్యాసంస్థలు రావడం సంతోషకరం."

**- రాజరాజేశ్వరి నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్**

**ప్రభుత్వానికి 'జై' కొట్టిన జనం**

ఐటీ కారిడార్ వంటి ఖరీదైన ప్రాంతంలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ప్రభుత్వ కళాశాల రాబోతుండటంతో స్థానికులు సంబరాలు చేసుకుంటున్నారు. కబ్జాలను తొలగించి ఊరుకోకుండా, వెంటనే ప్రజావసరాల కోసం పనులు మొదలుపెట్టడంపై అధికారులను సామాన్య ప్రజలు అభినందనలతో ముంచెత్తారు.



# అర్ధశతాబ్ది వైభవం.. బిర్లామందిరం!

**నగరం నడిబొడ్డున ఎత్తయిన కొండ, దానిపైన అందాల పాలరాతి మందిరం. అందులో కొలువైన శ్రీనివాసుడిని చూసి భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందితే, పర్యటకులు స్వామి దర్శనంతోపాటు ఆ శిల్పకళా సౌందర్యానికి మంత్ర ముగ్ధులవుతారు. భాగ్యనగర కీర్తికిరీటాల్లో ఒకటైన ఆ అద్భుత సృష్టే... బిర్లా మందిర్. ఈ వెంకన్న సన్నిధి యాభై వసంతాలను పూర్తిచేసుకున్న సందర్భంగా... ఆ పాలరాతి వైకుంఠం వైభవాన్ని తెలుసుకుందాం.**

బిర్లామందిర్... పగటిపూట పండువెన్నెల్లా కనిపిస్తుందా... రాత్రయితే చాలు, లైట్ల వెలుగుల మధ్య మిరుమిట్లు గొలుపుతూ అబ్బురపరుస్తుంది. శ్రీనివాసుడు తన దేవేరులతో కలిసి వెలిసిన పాలరాతి శిల్పసౌందర్యం వైకుంఠవాసుడి పాలకడలిని తలపిస్తుంది. బుద్ధభగవానుడు కొలువై ఉండే హుస్సేన్‌సాగర్‌కు అల్లంత దూరాన కుప్పపోసిన వెన్నెలవెలుగులా కనిపించే ఈ వెంకన్న మందిరం భాగ్యనగరానికే తలమానికం. ఈ ఏడాదికి యాభైఏళ్లు పూర్తిచేసుకుని స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటున్న ఈ మందిరం విశేషాలు అన్నీఇన్నీ కావు. వాటన్నింటికన్నా ముందు... ఈ బాలాజీ మందిరం రూపుదిద్దుకోవడం వెనుక ఉన్న కథ గురించీ తెలుసుకోవాలి.

**ఎవరు నిర్మించారంటే...**

దేశవ్యాప్తంగా వేంకటేశ్వరస్వామి మందిరాల్ని నిర్మించాలనే సదాశయంతో హిందూస్థాన్ ఛారిటీ ట్రస్టు బిర్లా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసింది. అలా బిర్లా సంస్థ పలు ప్రాంతాల్లో దాదాపు ముప్ఫైఅయిదు వేంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించింది. వాటిల్లో మొదటిది దిల్లీలో ఉంటే... రెండోది హైదరాబాద్‌లో నిర్మించారు. అలా నగరం నడిబొడ్డున 280 అడుగుల ఎత్తులో ఉండే కాలాపహాడ్(నీలాద్రికొండ)పైన బిర్లా మందిర నిర్మాణానికి 1966లో శ్రీకారం చుట్టారు. అయితే, ఆలయం పూర్తి కావడానికి సుమారు పది సంవత్సరాలు పట్టింది. అచ్చంగా పాలరాతితో రూపుదిద్దుకున్న ఈ ఆలయం నిర్మాణానికి ఇంచుమించు 2000 టన్నుల పాలరాయిని ఉపయోగించారు. ఈ పాలరాయిని రాజస్థాన్‌లోని మకరానా అనే ప్రాంతం నుంచి తెప్పించారు. ఇక, మూలవిరాట్టుకోసం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో దొరికే నల్లశిలను ఎంచుకుంటే స్వామివారి విగ్రహాన్ని గణపతి స్థపతి చెక్కారు. అలా పదేళ్ల తర్వాత 1976లో ఓ శుభ ముహూర్తాన త్రిదండి శ్రీమన్నారాయణ జీయర్ స్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేయడంతో బిర్లా మందిర్ భక్తులకు అందుబాటులోకి వచ్చింది.

**అణువణువూ అద్భుతమే...**

**ఆ నిత్యాన్నదానానికి... రెండొందల ఏళ్లు!**





బిర్లామందిరం నిర్మాణం దక్షిణఉత్తరాది ఆలయ నిర్మాణ శైలుల అద్భుత మిశ్రమంలా అనిపిస్తుంది. ప్రధానంగా 51 అడుగుల రాజగోపురం, గరుడ మందిరం తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతిరూపంలా ఉంటే... ముఖ మండపం, మధ్య మండపం, విమాన గోపురం పూరీజగన్నాథ క్షేత్రాన్ని తలపిస్తాయి. ఇక, మండపంలోని పైకప్పు మౌంట్ అబు శైలి నిర్మాణంతో అలరారుతుంది. ప్రధాన ద్వారం దాటి కొండపైకి వస్తున్న భక్తులకు 15 అడుగుల ఎత్తులో శ్రీకృష్ణుడి నల్లరాతి విగ్రహం కనిపిస్తుంది. కాస్త ముందుకు వెళ్లేకొద్దీ వినాయకుడి ఆలయం, శివపార్వతులూ, హనుమంతుడి ఉపాలయాలూ ఉంటాయి. ఇక్కడ ఉన్న హనుమంతుని విగ్రహం ఆలయాన్ని నిర్మించే సమయంలో అక్కడే దొరకడంతో అలాగే తెచ్చి ప్రతిష్ఠించారట. గోవింద నామస్మరణతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ చుట్టూ ఉన్న పాలరాతి అందాలను తిలకిస్తూ ఆలయం లోపలికి వెళ్లే భక్తులకు చెరోవైపు ఉన్న జయ విజయుల మధ్య పదకొండు అడుగుల ఎత్తులో నుదుటన వజ్రంతో వేంకటేశ్వరస్వామి దర్శనం ఇస్తాడు. ఆ మూలమూర్తికి ఇరువైపులా పద్మావతీ, అండాళ్ కొలువుదీరితే ఎదురుగా గరుడ ఆలయాన్నీ చూడొచ్చు. అలాగే 45 అడుగుల ఎత్తులో ఉండే ధ్వజస్తంభమూ ఆకట్టుకుంటుంది. వీటన్నింటితోపాటు ఆలయ గోడలపైన రామాయణ, మహాభారత ఘట్టాలనూ అంతే అందంగా తీర్చిదిద్దారు కళాకారులు. వాటన్నింటినీ చూసి తరించే భక్తులు... ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో కాసేపు సేదతీరేలా ప్రత్యేక ఏర్పాట్లూ ఉంటాయి.

**ప్రతి పూజా లోకకల్యాణార్థమే**

సాధారణంగా ఏ ఆలయానికి వెళ్తున్నా ఓ కొబ్బరికాయను తీసుకెళ్లడం సంప్రదాయం. లేదంటే ఓ టోకెన్‌ను తీసుకుని కుటుంబసభ్యుల పేరుపైన అర్చన చేయించుకుంటాం. బిర్లామందిర్‌లో అవేవీ ఉండవు. ఇక్కడ కొబ్బరికాయను కొట్టనివ్వరు, అదే సమయంలో ప్రత్యేక అర్చనలూ, పూజలూ ఉండవు. స్వామివారికి నిర్వహించే ప్రతి పూజా పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ఉన్నా... అవన్నీ లోకక్షేమం కోసమేనని అంటారు నిర్వాహకులు. ఈ ఆనవాయితీని ఆలయం నిర్మించినప్పటినుంచీ అనుసరిస్తున్నామనీ అదే ఇప్పటికీ కొనసాగుతోందనీ చెబుతారు అర్చకులు. అంతెందుకు, ఈ ఆలయాన్ని నిర్మించిన బిర్లా ఫౌండేషన్ కుటుంబీకుల పేరుమీద కూడా ఈ యాభైఏళ్లలో ఒక్క పూజనూ చేయలేదట. ఇక, రోజూ ఆరున్నరగంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపే అర్చకులు ఆ తర్వాత ప్రత్యేక పూజలూ, అలంకరణలూ చేస్తారు. నిత్యహోమంతో స్వామి నామ శరణుఘోషతో ప్రతిధ్వనించే ఈ ఆలయంలో శుక్రవారాలు చేసే అభిషేకాన్ని చూసి తీరాల్సిందే. ప్రత్యేక పర్వదినాలతోపాటు తిరుమలలో మాదిరి ఆశ్వయుజమాసంలో ఇక్కడా బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా చేస్తారు. ముఖ్యంగా నవరాత్రుల్లో శ్రవణానక్షత్రం రోజున స్వామివారి జన్మదిన మహోత్సవాన్ని నిర్వహించే తీరు కన్నులపండుగ్గా ఉంటుంది. ఇవి కాకుండా



శ్రావణమాసంలో, ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి, శ్రీకృష్ణజన్మాష్టమి... తదితర పర్వదినాలనూ ఎంతో విశేషంగా జరుపుతారు.

**పటికబెల్లమే ప్రసాదం**

ప్రతిరోజూ ఇంచుమించు అయిదారువేలమంది, వారాంతాల్లో పదకొండువేలమంది దాకా భక్తులు ఆలయానికి వస్తే... పర్వదినాల్లో ముఖ్యంగా ఉగాది, వైకుంఠ ఏకాదశి, కొత్త ఏడాది వంటి రోజుల్లో ఏకంగా లక్షమంది దర్శించుకునే ఈ బిర్లామందిరంలో మరికొన్ని విశేషాలూ ఉన్నాయి.

ఇక్కడ కొలువైన స్వామివారికి చేయించే ఆభరణాలన్నింటినీ తిరుమలలో శ్రీనివాసుడికి నగలు తయారుచేసేవారికే అప్పగిస్తారట. ఇక, ఆలయంలో భక్తులకు పెట్టే శఠగోపాన్ని శ్రీరంగంలోని రంగనాథ క్షేత్రం నుంచి తీసుకొచ్చారట.

ఈ గుడిలో గంట కనిపించదు. ఆగమ శాస్త్రం ప్రకారం ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా కేవలం పూజ చేస్తున్నప్పుడు మాత్రమే గంటను కొట్టాలట. ఆ నియమాన్ని అనుసరించే గంటను ఏర్పాటు చేయలేదు నిర్వాహకులు. అదే సమయంలో స్వామి సన్నిధిలోని ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలిగించకూడదనే ఉద్దేశమూ అందుకు కారణమట.

స్వామివారిని దర్శించుకునే భక్తులకు మిశ్రి (కలకండ), తులసీదళాలనే ప్రసాదంగా ఇస్తారు. అలాగే కుంకుమకు బదులు చందనాన్ని బొట్టుగా అలంకరించుకోవాలి.

సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీకగా ఏసుక్రీస్తు, గురునానక్, బుద్ధభగవానుడి బోధనలనూ ఆలయగోడలపైన రాసిన తీరూ భక్తులను ఆకట్టుకుంటుంది.

ఆలయాన్ని సందర్శించే భక్తులు స్వామివారికి ఏవైనా కానుకలు ఇవ్వాలంటే హుండీలోనే వేయాల్సి ఉంటుంది. హారతి పళ్లెంలోనూ డబ్బులు వేయనివ్వరు అర్చకులు. పూజారుల చేతికి ఇచ్చినా స్వీకరించరు. అలాగే శివపార్వతులూ, గణేశుడు, హనుమంతుడు, సరస్వతీ, లక్ష్మీనారాయణుడు, సాయిబాబా తదితర దేవతావిగ్రహాలనూ ఇక్కడ దర్శించుకోవచ్చు.

# ఉద్యమకారుల ఆత్మగౌరవ పోరాటానిదే విజయం

* **కవితమ్మ హెచ్చరికతోనే దిగివచ్చిన ప్రభుత్వం: కప్పాటి పాండురంగారెడ్డి.**



రంగారెడ్డి కలెక్టరేట్తె, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం సాగుతున్న పోరాటం సత్ఫలితాలనిస్తోందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలపై స్పందించడం తెలంగాణ జాగృతి పోరాట పటిమకు దక్కిన విజయమని అభివర్ణించారు.

**పోరాట ఫలితమే మంత్రి హామీ:**

రాష్ట్రం సిద్ధించి ఇన్నేళ్లవుతున్నా ఉద్యమకారులకు ఆశించిన గుర్తింపు, ఆత్మగౌరవం లభించలేదని పాండురంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "ఉద్యమకారుల సమస్యలను విస్మరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్న" తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరికతోనే ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. ఈ ఒత్తిడి వల్లే మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా వచ్చి ఉద్యమకారుల వినతులను స్వీకరించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

**కేటీఆర్ మౌనంపై విస్మయం:**

మరోవైపు, ఉద్యమకారుల సమస్యలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మౌనం వహించడాన్ని పాండురంగారెడ్డి తప్పుబట్టారు. ఒకవైపు కవిమ్మ పోరాడుతుంటే, కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గతంలో ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేసి, అసలైన పోరాట యోధులను విస్మరించామన్న అపరాధ భావనతోనే ఆయన ముఖం చాటేస్తున్నారా అని విమర్శించారు. ఉద్యమకారుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తెలంగాణ జాగృతి అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# వైశ్యరాజు జ్యువెలర్స్ – 17 వ బ్రాంచ్ ప్రారంభం

* **ప్రముఖ సినీ నటి అనుపమ పరమేశ్వరన్ సందడి**





ఎల్బీనగర్, ఫిబ్రవరి 22 (భారత శక్తి): హైదరాబాద్ లోని చైతన్యపురిలోని ఐసీఐసీఐ బ్యాంక్ పక్కన వైశ్యరాజు జ్యువెలరీ షోరూమ్ 17వ బ్రాంచ్‌ను ప్రముఖ సినీ నటి అనుపమ పరమేశ్వరన్ ఘనంగా ప్రారంభించారు.రిబ్బన్ కట్టింగ్ చేసి,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ఆరంభించిన అనుపమ పరమేశ్వరన్, కొత్త బ్రాంచ్ అందమైన ఇంటీరియర్ డిజైన్ మరియు విభిన్న ఆభరణాల కలెక్షన్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా షోరూమ్ యాజమాన్యం మాట్లాడుతూ, వధూవరుల కోసం ప్రత్యేక పెళ్లి కలెక్షన్లు, లేటెస్ట్ డిజైన్స్‌లో బంగారు, వజ్రాలు, ప్లాటినం ఆభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రారంభోత్సవానికి రాజకీయ నాయకులు, అభిమానులు, స్థానిక ప్రముఖులు, వ్యాపార వేత్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనుపమతో ఫోటోలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. చైతన్యపురి ప్రాంతంలో ఈ కొత్త బ్రాంచ్ ప్రారంభం కావడం స్థానికులకు మరింత సౌకర్యాన్ని కల్పించనుంది.

# ఓ బాపు...కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానం ప్రసాదించు

: **ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి_**

* **మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే _**



మహేశ్వరం, ఫిబ్రవరి 22 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలం దిల్వార్‌గూడ గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, "గాంధీజీ కన్న కలలు, ఆశయాలను ఆచరించినప్పుడే దేశం సుభిక్షంగా, శాంతియుతంగా ముందుకు సాగుతుంది. కానీ నేటి తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల ఆశయాలను తుంగలో తొక్కుతూ, హింసను ప్రేరేపిస్తూ, అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తోంది. ఓ బాపూ... నువ్వైనా చెప్పు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మీ సాక్షిగా హెచ్చరిస్తున్నాం" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనాథ గృహ విద్యార్థులకు అన్న వితరణ గావించిన చాపరాల కుటుంబసభ్యులు



ఎల్బీనగర్, ఫిబ్రవరి 22 (భారత శక్తి): చాపరాల పెద్దల సంస్మరణ దిన సందర్భంగా ఎల్బీనగర్ లో చిత్రా లేఅవుట్ అనాథ విద్యార్థి గృహంలో సమావేశం జరిగింది. సమావేశానికి ముందు అనాథ విద్యార్థులకు చాపరాల ఇందిర తన పెద్దల సంస్మరణగా అన్నదానం చేశారు. చాపరాల లక్ష్మి నరసింహ దాసు శృతకీర్తి, చాపరాల రాఘవమ్మ , చాపరాల శ్రీనివాస కుమారి, చాపరాల విజయకృష్ణల జ్ఞాపకార్థంగా అనాథ విద్యార్థులకు ఈ అన్నదానం చేశారు. విద్యార్థులతో జరిగిన సమావేశంలో స్పెక్ట్, అవయవ దాన సభ్యులు మాట్లాడారు.శరీర దాన, అవయవ దాన తెలంగాణ ఉపాధ్యక్షులు పిట్టల అంజయ్య, ఉపాధ్యక్షురాలు చాపరాల ఇందిర అవయవదానం విల్లు రాసిన వి.నాగమణి స్పెక్ట్ కార్యకర్త ఏ. రజని, రచయిత ఆర్. చంద్రశేఖర రావులు మాట్లాడారు. అనాథ ఆశ్రమంలోని విద్యార్థులందరూ బాగా చదువుకుని ఈ ఆశ్రమానికి, మీ ఊరికి మంచి పేరు తేవాలని, మీరందరూ సైంటిస్టులు,డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు కావాలని, మంచిగా, శ్రద్ధగా చదవి ప్రయోజకులు కావాలని కోరారు. విద్యార్థులు ప్రయోజకులై చదువుకోవడానికి కష్టపడే విద్యార్థులకు మీ వంతు ఆర్థిక సాయం చేయాలని చెప్పారు. విద్యార్థులు అందరూ శ్రద్ధగా విన్నారు. చాపరాల శ్రీనివాస కుమారి ఇటీవల చనిపోతూ నేత్ర దానం, అవయవ దానం చేశారు. 40 సంవత్సరాల క్రితమే సియల్‌ఎన్ దాసు నేత్ర దానం చేశారు.



# బీటీ రోడ్ల పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 22 (భారత శక్తి): హయత్ నగర్ బస్ డిపో వెళ్ళు మార్గంలో జాతీయ రహదారికి అనుగుణంగా ఉన్న సర్వీస్ రోడ్డు, అనుసంధాన కాలనీ లింక్ రోడ్లకు నిర్మిస్తున్న బీటీ రోడ్ల పనులను స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, హయత్ నగర్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అత్యంత అవసరమని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణకు అనుగుణంగా సర్వీస్ రోడ్లు మరియు కాలనీ లింక్ రోడ్లు బలమైన బీటీ రోడ్లుగా నిర్మించబడటం వల్ల స్థానిక ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని అన్నారు.ప్రత్యేకంగా హయత్ నగర్ బస్ డిపో పరిసర ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మెరుగుపడితే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు వ్యాపార కార్యకలాపాలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అలాగే ఇదే విధంగా అన్ని లింక్ రోడ్లను కూడా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా బీటీ రోడ్లుగా నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ, ప్రజల అవసరాలే తమ ప్రాధాన్యత అని, ఎల్లప్పుడూ ప్రజలతో కలిసే అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# మేము ఉన్నాం మిత్రమా...

* **సహచరుని కుటుంబానికి ఆర్థిక ఆసరా అందించి.. మేము ఉన్నామని భరోసా ఇచ్చిన 2002 బ్యాచ్ సబ్ ఇన్స్పెక్టర్లు..**



ఎల్బీనగర్, ఫిబ్రవరి 22 (భారత శక్తి): గ్రూపు సభ్యుల నుంచి విరాళాలు సేకరించి సురక్ష సేవా సంఘం ద్వారా, మృతుడు సీఐ జాన్సన్ బాబు కుటుంబానికి 8 లక్షల రూపాయలు అందించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇన్స్ పెక్టర్లు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని 2002 బ్యాచ్ కి చెందిన సబ్ ఇన్స్పెక్టర్ ప్రస్తుత ఏహెచ్టీయు ఇన్స్ పెక్టర్ జాన్సన్ బాబూరావు గత సంవత్సరం 10 వ నెలలో అనారోగ్యం కారణంగా మరణించారు. హఠాత్తుగా సహచర మిత్రుడు మరణించడంతో జీర్ణించుకోలేని సహచర అధికారులు జాన్సన్ బాబు కుటుంబానికి అండగా నిలిచారు. గ్రూపు సభ్యుల నుండి విరాళాలు సేకరించి, సురక్ష సేవా సంఘం ద్వారా తక్షణ సహాయం కింద 8 లక్షల రూపాయలు మృతుని కుటుంబానికి ఆదివారం అందించి, భవిష్యత్ లో ఎటువంటి అవసరాలకైనా మేమున్నామని భరోసా ఇచ్చారు. పక్కవాడు పోతే నాకేంటి అని పక్కకు పోయే ఈరోజుల్లో, సహచర మిత్రుడి కుటుంబం పట్ల చూపిన ఔదార్యానికి 2002 బ్యాచ్ పోలీస్ అధికారులకు సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ముద్దనూర్ ఎస్.నగేష్ బాబు, కడప ఉజ్జిని సదాశివయ్య, చిన్న చౌక్ గౌనీ, ఓబులేష్, వేంపల్లి టీ. నర్సింహులు, కొండాపూర్ పి. రాజా, మున్నూరు ఎస్.లింగప్ప, డీటీఆర్బీ కడప ఎస్ మహమ్మద్ బాబా, కడప రైల్వే ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్లు శ్యామల వెంకటేష్, అవ్వారి నరసింహ స్వామి, నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ పార రాజు, సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

# ఆర్థిక లావాదేవీలతోనే యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్య!

కూసుమంచి, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ (48) ది హత్యేనని, అతని స్నేహితుడు వేణు మాధవరెడ్డి ముగ్గురు వ్యక్తులతో హత్య చేయించాడని ఖమ్మం గ్రామీణ ఏసీపీ తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శ్రీనివాస్‌కు, వేణు మాధవరెడ్డికి మధ్య ఆర్థికపరమైన విభేదాలు ఉన్నాయని, ఈ క్రమంలోనే అతని అడ్డు తొలగించుకునేందుకు కుట్ర పన్నాడని వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, అదే జిల్లాలోని చుంచుపల్లికి చెందిన ఎండీ అజ్మత్ అలీ ఖాన్‌లను సంప్రదించి వారి సహకారంతో శ్రీనివాస్‌ను కారులో విజయవాడ తీసుకెళ్తూ నార్కెట్‌పల్లి వద్ద హత్య చేయించాడన్నారు. నేరం బయట పడకుండా, దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు కారులో మృతదేహాన్ని ఉంచి, పాలేరు జలాశయంలో తోసేసినట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. అతి తక్కువ రోజుల్లోనే కేసును ఛేదించిన కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సైలు నాగరాజు, దివ్యశ్రీ, జగదీశ్, సంతోష్‌లను ఏసీపీ అభినందించారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనపై 'సుదర్శనం'

* **ప్రోజెన్సీ మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**
* **సికింద్రాబాద్, చార్మినార్ పరిధిలో ఆకస్మిక తనిఖీ.. క్షేత్రస్థాయిలో ప్రక్రియ పరిశీలన**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియలో భాగంగా చేపట్టిన 'ప్రోజెన్సీ మ్యాపింగ్' (Progeny Mapping) సర్వేను అత్యంత పారదర్శకతతో, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (CEO) సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్‌తో కలిసి నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న మ్యాపింగ్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు**

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వర్ నగర్ (పోలింగ్ కేంద్రం 211), చార్మినార్ నియోజకవర్గంలోని కబుత్తర్ ఖానా (పోలింగ్ కేంద్రం 12) పరిధిలో జరుగుతున్న సర్వేను సిఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (BLO), సూపర్ వైజర్లతో మాట్లాడి మ్యాపింగ్ విధానంపై వారికి ఉన్న అవగాహనను స్వయంగా పరీక్షించారు.

**మ్యాపింగ్ ప్రక్రియ ఇలా..**

ఇంటింటి సర్వేలో భాగంగా అధికారులు అనుసరిస్తున్న తీరును సిఈఓకు బీఎల్ఓలు వివరించారు:

* పోలిక: 2002 నాటి ఓటరు జాబితాలోని వివరాలను, ప్రస్తుత 2025 జాబితాతో పోల్చి చూస్తున్నారు.
* గుర్తింపు: పాత జాబితాలో ఉన్న ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, వారు ప్రస్తుత జాబితాలో ఉంటే వారిని మ్యాపింగ్ చేస్తున్నారు.
* లక్ష్యం: దీనివల్ల ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా పక్కాగా జాబితాను రూపొందించవచ్చు.

**ఖచ్చితత్వమే పరమావధి**

ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. "భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాలో ఖచ్చితత్వం, పారదర్శకత చాలా ముఖ్యం. ఏ ఒక్క అర్హుడు ఓటు హక్కు కోల్పోకూడదు. ఈ ప్రోజెన్సీ మ్యాపింగ్ ద్వారా ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దవచ్చు. ఈ ప్రక్రియను ఈఆర్ఓ (ERO), ఏఈఆర్ఓ (AERO)లు నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలి," అని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా జరిగే ఈ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని, తమ కుటుంబ సభ్యుల వివరాలను బీఎల్ఓలకు అందించి జాబితాలో కచ్చితత్వం ఉండేలా చూడాలని అధికారులు కోరారు.

# ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్: సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : రానున్న ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకెళ్లాలంటే డిజిటల్ కనెక్టివిటీ అత్యంత కీలకమని ఆయన అన్నారు. భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం (MoC) కుదిరింది. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. డిజిటల్ భారత్ నిధి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య కుదిరిన ఈ ఒప్పందంపై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సంతకాలు చేశారు.

*** భారత్ నెట్ ప్రాజెక్ట్‌తో డిజిటల్ విప్లవం**

రాష్ట్రంలో సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో 'అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్ఏబీఎన్‌పీ'ని అమలు చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్లు కేటాయించడానికి అంగీకరించింది. ప్రాజెక్ట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్' (APBIL) పేరుతో ప్రత్యేక యంత్రాంగాన్ని (SPV) ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిధులు సమకూర్చి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ఫేజ్ I కింద ఉన్న 1,692 పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయడం, ఫేజ్ IIలోని 11,254 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పూర్తి చేయడం, కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్షన్లు ఇవ్వడం వంటి




పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈగవర్నెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

*** గత ప్రభుత్వం ఫైబర్ నెట్‌ను నాశనం చేసింది: సీఎం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "201419 మధ్య కాలంలో విద్యుత్ స్తంభాల ద్వారా ఫైబర్ కేబుల్స్ వేసి 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చాం. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం దురుద్దేశంతో ఆ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసింది. దాని ఫలితంగా కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది. ఇప్పుడు మళ్లీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో డిజిటల్ కనెక్టివిటీని ప్రతి ఇంటికీ అందిస్తాం" అని ఆయన వివరించారు. తాను తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి టెక్నాలజీకి ప్రాధాన్యత ఇస్తున్నానని, టెలికాం రంగంలో సంస్కరణల కోసం నాటి ప్రధాని వాజ్‌పేయిని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

*** టెక్నాలజీతో సుపరిపాలన, ఏపీకి ఉజ్వల భవిష్యత్తు**

"ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో దేశంలో డిజిటల్ విప్లవం అద్భుతంగా సాగుతోంది. గ్లోబల్ నాలెడ్జ్‌ను గ్రామాలకు చేర్చాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలి. దానికి కేంద్రం సహకరిస్తుండటం శుభపరిణామం" అని చంద్రబాబు అన్నారు. టెక్నాలజీతో పాలనను సులభతరం చేస్తున్నామని, వాట్సాప్ ద్వారా 900కు పైగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూ రికార్డులకు భద్రత కల్పిస్తున్నామని, సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తేబోతున్నామని చెప్పారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయనే భయం వద్దు. ఏఐ ద్వారా కొత్త ఉద్యోగాలు సృష్టించేలా యువతలో నైపుణ్యాలు పెంచుతున్నాం. వన్ ఫ్యామిలీవన్ ఏఐ ఎక్స్‌పర్ట్ అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి కన్సార్షియంతో దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను రాష్ట్రానికి తెస్తున్నాం. రానున్న రెండేళ్లలో అమరావతి నుంచే క్వాంటం కంప్యూటర్లు ఉత్పత్తి చేయాలనేది మా ఆలోచన. టెక్నాలజీ, టెలికాం రంగంలో ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా ఆంధ్రప్రదేశ్ ఒక టెస్ట్ బెడ్‌గా సిద్ధంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ నెట్ ఎండీ గీతాంజలి శర్మ, బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జగన్‌కు లోకేశ్ ఘాటు కౌంటర్..
# మీది కపట ప్రేమ అంటూ ఫైర్

అమరావతి, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : ఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నిరసనపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసిన జగన్ ఇప్పుడు దేశ ప్రతిష్ఠ గురించి మాట్లాడటం కపట ప్రేమను ప్రదర్శించడమేనని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పోస్టు పెట్టారు. ఢిల్లీ ఏఐ సదస్సులో జరిగిన నిరసన దేశానికి తలవంపులు తెచ్చిందని, రాజకీయ విబేధాలున్నా ప్రపంచ వేదికపై దేశ గౌరవాన్ని కించపరచవద్దని జగన్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన లోకేశ్, జగన్ గతాన్ని గుర్తు చేస్తూ పలు ఆరోపణలు చేశారు. 'భారత్‌లో పెట్టుబడుల వాతావరణానికి అందరికంటే ఎక్కువ నష్టం కలిగించిన వ్యక్తి, ఇప్పుడు నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారు. ఈ కపటత్వం ఆశ్చర్యం కలిగిస్తోంది' అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ గతంలో తీసుకున్న పలు నిర్ణయాలను లోకేశ్ ఏకరువు పెట్టారు. 2017లో ఇన్వెస్ట్‌మెంట్ సదస్సును అడ్డుకునేందుకు విమానాశ్రయంలో ధర్నా చేశారు. 2019లో అంతర్జాతీయ పెట్టుబడిదారులతో కుదిరిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేశారు. 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వం పెట్టాల్సిన పెట్టుబడులను అడ్డుకున్నారు. 2025లో ప్రభుత్వ నిధుల సమీకరణను నిలిపివేయాలని ఆర్‌బీఐకి లేఖ రాశారు. ఇప్పుడు 2026లో ఏఐ సదస్సు ఘటనపై ఆందోళన చెందుతున్నట్టు నటిస్తున్నారని లోకేశ్ విమర్శించారు.

## ఏపీ సీఎం చంద్రబాబుతో
# డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ

అమరావతి, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : ఆంధ్రప్రదేశ్‌లో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ప్రముఖ సంస్థ డైనమాటిక్ టెక్నాలజీస్ ఆసక్తి కనబరిచింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆయన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. డైనమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ ఉదయంత్ మల్హోత్రా నేతృత్వంలోని బృందం ఈ భేటీలో పాల్గొంది. ఈ సందర్భంగా ఏవియేషన్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో తమ సంస్థ కార్యకలాపాలు, అనుభవాన్ని వివరిస్తూ ప్రతినిధులు సీఎంకు ప్రజంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా రక్షణ రంగంలో తమకున్న నైపుణ్యాన్ని వారు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..




ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు ఉన్న అపార అవకాశాలను, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను, విధానాలను వారికి తెలిపారు. ఈ సమావేశంలో డైనమాటిక్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పి. చలపతి, డైరెక్టర్ అహిల్యా మల్హోత్రా, సీఈఓ ఆండ్రియా మిలానీ, యూరప్ కార్యకలాపాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ క్రిస్టినా లిడేగార్డ్ పాల్గొన్నారు. ప్రభుత్వ పక్షాన పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# హార్వర్డ్ నుంచి సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నుంచి అరుదైన ఆహ్వానం అందింది. మార్చి 27న జరగనున్న 'ఏఐ పాలసీ సింపోజియం'లో ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లోని బిజినెస్ అండ్ గవర్నమెంట్ ప్రోగ్రామ్, ఏఐ అండ్ టెక్ పాలసీ కాకస్ సంయుక్తంగా ఈ సింపోజియంను నిర్వహిస్తున్నాయి. 'ఏఐ యాజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కంప్యూట్ పవర్: ఇంపాక్ట్ ఆన్ లివబిలిటీ & వర్క్‌ఫోర్స్' అనే అంశంపై జరిగే ప్యానెల్ చర్చలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. డేటా సెంటర్లు, ఇంధన వ్యవస్థలు, పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన ఏఐ విస్తరణకు అవసరమైన నైపుణ్యాల కల్పన వంటి అంశాలపై ఈ సెషన్‌లో చర్చిస్తారు. భారత్ ఫ్యూచర్ సిటీ చొరవలో భాగంగా తెలంగాణలో 'ఏఐ సిటీ' నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికత, నాయకత్వానికి ఈ ఆహ్వానం ఒక గుర్తింపు అని సీఎంఓ పేర్కొంది. ఏఐ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడంలో భూ కేటాయింపులు, విద్యుత్ మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాల్లో రేవంత్ రెడ్డి పాలనా అనుభవం ప్రపంచ విధాన రూపకర్తలకు, పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), టెక్నాలజీ పాలసీ, ఆవిష్కరణల ఆధారిత అభివృద్ధిలో తెలంగాణ నాయకత్వానికి పెరుగుతున్న అంతర్జాతీయ గుర్తింపునకు ఈ ఆహ్వానం నిదర్శనమని చెప్పవచ్చు. ఇటీవల ముఖ్యమంత్రి అమెరికాలో పర్యటించినప్పుడు ఈ సింపోజియం నిర్వాహకులు ఆయనతో సమావేశమై ఈ కార్యక్రమం గురించి చర్చించారు.

# ఐఎన్ఎస్ అరిదమన్... భారత్ అమ్ములపొదిలో శత్రుభీకర అస్త్రం

ఫిబ్రవరి 22 : సముద్ర జలాల్లో భారత అణు నిరోధక సామర్థ్యం అనూహ్యంగా పెరగనుంది. దేశీయంగా నిర్మించిన మూడో అరిహంత్ శ్రేణి అణు బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి (SSBN) 'ఐఎన్ఎస్ అరిదమన్' (S4) ఈ ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో నావికాదళంలోకి ప్రవేశించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఇది సముద్ర పరీక్షల తుది దశలో ఉందని రక్షణ రంగ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామం భారత నావికాదళ శక్తిని, ముఖ్యంగా ప్రతీకార దాడి సామర్థ్యాన్ని శిఖర స్థాయికి చేర్చనుంది. విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసెల్ (ATV) ప్రాజెక్టు కింద ఐఎన్ఎస్ అరిదమన్‌ను నిర్మించారు. 7,000 టన్నుల బరువున్న ఈ జలాంతర్గామి, ఇదివరకే సేవలు అందిస్తున్న ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్ (6,000 టన్నులు) కంటే పెద్దది, శక్తిమంతమైనది. దీని బరువు పెరగడం వల్ల క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యం కూడా గణనీయంగా పెరిగింది. పాత నౌకల్లో కేవలం నాలుగు వర్టికల్ లాంచ్ సిస్టమ్ (VLS) ట్యూబ్‌లు ఉండగా, అరిదమన్‌లో వీటి సంఖ్యను ఎనిమిదికి పెంచారు. దీని ద్వారా ఒకేసారి 24 స్వల్ప శ్రేణి K15 సాగరిక (750 కి.మీ. పరిధి) క్షిపణులను లేదా 8 మధ్యంతర శ్రేణి K4 (3,500 కి.మీ. పరిధి) క్షిపణులను ప్రయోగించవచ్చు. భవిష్యత్తులో రానున్న 6,000 కి.మీ. పరిధి గల K5 క్షిపణులను కూడా మోసుకెళ్లేలా దీనిని రూపొందించారు. అరిదమన్‌కు 83 మెగావాట్ల సామర్థ్యం గల కాంపాక్ట్ లైట్ వాటర్ రియాక్టర్ (CLWR) శక్తిని అందిస్తుంది. ఇది చాలా తక్కువ శబ్దం (లో అకౌస్టిక్ సిగ్నేచర్) చేస్తుంది. దీంతో పాటు అనెకోయిక్ టైల్స్, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఉషస్', 'పంచేంద్రియ' వంటి అత్యాధునిక సోనార్ వ్యవస్థల వల్ల సముద్ర గర్భంలో శత్రు రాడార్లకు, సోనార్లకు చిక్కకుండా అత్యంత రహస్యంగా కదలగలదు. ఉపరితలంపై గంటకు 1215 నాట్ల వేగంతో, నీటి అడుగున 24 నాట్ల వేగంతో ఇది ప్రయాణిస్తుంది. అరిదమన్ చేరికతో, భారత వ్యూహాత్మక దళాల కమాండ్ (SFC) పరిధిలోకి మూడు అణు జలాంతర్గాములు వస్తాయి. దీనివల్ల 'నిరంతర సముద్ర పర్యవేక్షణ' (Continuous AtSea Deterrence) సాధ్యమవుతుంది. అంటే, కనీసం ఒక అణు జలాంతర్గామి ఎల్లప్పుడూ సముద్రంలో పహారా కాస్తూ, శత్రువుల నుంచి ముప్పు ఎదురైతే వెంటనే ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉంటుంది. దీనిని విశాఖపట్నం సమీపంలోని అత్యంత భద్రత కలిగిన నావికా స్థావరం 'ప్రాజెక్ట్ వర్ష'లో మోహరించనున్నారు. ఇది భారత అణు త్రివిధ దళాల (భూమి, గగనతలం, సముద్రం) సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేస్తుంది. ఇదే సమయంలో రష్యా నుంచి చక్ర III అటాక్ సబ్‌మెరైన్, జర్మనీ సహకారంతో ప్రాజెక్ట్ 75(I) కింద మరో ఆరు జలాంతర్గాముల నిర్మాణం వంటి ప్రాజెక్టులతో భారత నావికాదళం తన శక్తిని మరింత విస్తరించుకుంటోంది.

## దేశంలోనే వేగవంతమైన మెట్రో...
# మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

ఉత్తర ప్రదేశ్, ఫిబ్రవరి 22 :దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీమీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్



మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీమీరట్ నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం...
# మావోయిస్టు కీలక నేతలు లొంగుబాటు

- **లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, మల్లారెడ్డి**
- **తెలంగాణ ఎస్ఐబీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు**
- **వీరితో పాటు 16 మంది లొంగుబాటు**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (భారతశక్తి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో కీలక పరిణామం చోటు చేసుకున్నది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి భద్రతా బలగాలకు సరెండర్ అయ్యారు. దేవ్ జీ మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీగా ఉండగా, రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.



## శ్రీశైలంలో భక్తులకు
# తప్పిన పెను ప్రమాదం



శ్రీశైలం, ఫిబ్రవరి 22 (భారతశక్తి) :శ్రీశైలం పుణ్యక్షేత్రంలో భక్తులకు పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. యాత్రికులు బస చేసిన ఓ వీఐపీ కాటేజీలో అగ్నిప్రమాదం సంభవించింది. అప్రమత్తమైన భక్తులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. ఈ ఘటనతో అక్కడున్న వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీశైలంలోని ఓ వీఐపీ కాటేజీ గదిలో ఉన్న ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఏసీ నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగతో పాటు మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గదిలో ఉన్న భక్తులు మంటలను గమనించి, భయంతో కేకలు వేస్తూ గది నుంచి బయటకు పరుగులు తీశారు. వారి అరుపులతో కాటేజీలోని ఇతర గదుల్లో ఉన్న వారు కూడా అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై శ్రీశైలం దేవస్థానం అధికారులు విచారణకు ఆదేశించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

# బల్దియా ఖజానాకు 'అవినీతి' గండి!

(హైదరాబాద్: ఫిబ్రవరి 22 భారత శక్తి): ప్రభుత్వ ఆదాయానికి రక్షణగా ఉండాల్సిన అధికారులే భక్షకులుగా మారారు. నిబంధనల తుంగలో తొక్కి, బడా వ్యాపారులతో చేతులు కలిపి జీహెచ్ఎంసీ (GHMC) ఖజానాకు కన్నం వేస్తున్నారు. సరూర్ నగర్ సర్కిల్ కేంద్రంగా సాగుతున్న ఈ 'పన్ను'గడ అక్షరాలా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తోంది. గ్రౌండ్ + 5 అంతస్తుల మేడలున్నా, కాగితాల్లో మాత్రం వాటిని 'గుడిసె'ల స్థాయికి తగ్గించి చూపిస్తూ అక్రమ సంపాదనకు తెర లేపారు. ఈ వ్యవహారంలో బల్దియా అధికారుల లాగిన్లను సైతం దుర్వినియోగం, ఇతర సర్కిళ్ల పరిధిలోకి వెళ్లి మరీ చేస్తున్న 'వసూళ్ల' పర్వం ఇప్పుడు కలకలం రేపుతోంది.




*** పన్నుల మాయాజాలం: సాయిరాం హాస్పిటల్ సాక్షిగా..**

సరూర్ నగర్ ప్రధాన రహదారిపై ఉన్న సాయిరాం హాస్పిటల్ వ్యవహారం అధికారుల అవినీతికి నిలువుటద్దం. ఏడాది కాలంగా రికార్డుల్లోనూ, క్షేత్రస్థాయిలోనూ జరుగుతున్న ఈ మాయాజాలం గమనిస్తే విస్మయం కలగక మానదు.

ట్రేడ్ లైసెన్స్ లెక్క: హాస్పిటల్ ట్రేడ్ లైసెన్స్ (టిన్ : TR08020450002) ప్రకారం భవన విస్తీర్ణం 17,817 చదరపు అడుగులు. దీనికోసం రూ. 53,451 ఫీజు చెల్లించారు.

ఆస్తి పన్ను లెక్క: అదే భవనం ఆస్తి పన్ను (పిటిన్ : 1031300934) రికార్డుల్లో మాత్రం కేవలం 8,857 చదరపు అడుగులు మాత్రమే ఉంది.

అక్రమం: అధికారుల 'ముడుపుల' మత్తు వల్ల దాదాపు 9,080 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని పన్ను పరిధి నుంచి తప్పించారు. దీనివల్ల ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ. 12 లక్షల ఆదాయాన్ని కోల్పోతోంది.



సాయిరాం హాస్పిటల్ ట్రేడ్ లైసెన్స్ కూడా తప్పుగా చేసారు .. డబల్ రోడ్ అయితే సింగల్ రోడ్ అని పెట్టి ఇంఛార్జ్ ఎఎంసీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ట్రేడ్ లైసెన్స్ ఇవ్వడం జరిగింది ....

పేద మధ్య తరగతి ప్రజలు డోర్ నెంబర్ అసెస్మెంట్ కోసం అప్లై చేసుకుంటే వాళ్ళ చెప్పులు అరిగేలా ఆఫీస్ చుట్టూ తిప్పి వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకోనిదే పని పూర్తి చేయడం లేదు అలాంటిది ఓల్డ్ హయత్ నగర్ సర్కిల్ కి సంబంధించిన డోర్ నెంబర్ అసెస్మెంట్ అప్లై చేసినాక ఒక గంటలో పని పూర్తి చేసారు. పక్కన సర్కిల్ కి సంబంధించిన తప్పుడు పనిచేయడానికి చూపించిన శ్రద్ధ సరూర్ నగర్ సర్కిల్ కి సంబంధించిన రెవిన్యూ విభాగం లాగిన్స్ లో నెలల తరబడి పెట్టుకోవడంలో ఎందుకు చూపించడం లేదు..

డీసీని కలిస్తే ఏఎంసి చేసాడు అని కింది స్థాయి అధికారులపైకి తోస్తున్నాడు తప్ప తప్పు చేసిందెవరు ? తప్పు చేసిన వాళ్ళ పైన ఏమి యాక్షన్ తీసుకుంటారని కాకుండా కాలయాపన చేయడం చూస్తుంటే అందరూ కలిసే లక్షల్లో మింగేస్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయ్

*** కోణార్క్ థియేటర్ వద్ద 'అక్రమ' సముదాయం**

కోణార్క్ థియేటర్ ఎదురుగా ఉన్న ఐదంతస్తుల (G+5) భారీ వ్యాపార సముదాయం అధికారుల అక్రమాలకు పరాకాష్ట. ఈ భవనంలోని ఒక హోటల్ ట్రేడ్ లైసెన్స్ విస్తీర్ణం 2,500 అడుగులు ఉంటే, మొత్తం ఐదు అంతస్తుల భవనం ఆస్తి పన్ను రికార్డుల్లో మాత్రం కేవలం 1,550 చదరపు అడుగులే ఉండటం గమనార్హం. ఏడాదికి రూ. 10 లక్షల పన్ను కట్టాల్సిన చోట, అధికారుల పుణ్యమా అని కేవలం రూ. 86,898తో యజమానులు సరిపెడుతున్నారు.

*** హద్దులు దాటిన 'వసూళ్ల' వేట!.**

సరూర్ నగర్ అధికారులు తమ సర్కిల్ పరిధి దాటి హయత్ నగర్ సర్కిల్ లోని ఆస్తులకు కూడా అక్రమంగా అసెస్మెంట్ చేస్తూ లక్షలు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మన్సూరాబాద్‌లోని ఓ భవనానికి (నెం: 38 439/1), నిబంధనలకు విరుద్ధంగా సరూర్ నగర్ అధికారుల లాగిన్ ద్వారా కేవలం ఒక్క గంటలోనే అసెస్మెంట్ పూర్తి చేయడం బల్దియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




*** అమాయకత్వం నటిస్తున్న అధికారులు:**

డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఏఎంసీ శ్రీనివాసరావుల లాగిన్ల నుంచే ఈ పనులు పూర్తయినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. "మాకు తెలియకుండానే జరిగిపోయింది" అని వారు



బుకాయించడం గమనార్హం. తప్పు జరగకపోతే వెంటనే పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్న ప్రశ్నలకు వారి వద్ద సమాధానం లేదు.

*** ప్రజాప్రతినిధుల ఆదేశాలకూ బేఖాతరు...!**

దిల్సుఖ్ నగర్, సరూర్ నగర్ ప్రాంతాల్లో వందలాది హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు వెలిసినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్వయంగా జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కు పన్నులను సవరించాలని సూచించినా, క్షేత్రస్థాయి అధికారులు మాత్రం 'మామూళ్ల' మత్తులో జోగుతూ కాలయాపన చేస్తున్నారు.

*** విజిలెన్స్ మౌనం.. అనుమానాల వెల్లువ!**

ఈ బాగోతం బయటపడి రెండు నెలలు గడుస్తున్నా, విజిలెన్స్ అధికారులు మౌనం వహించడం వెనుక ఉన్న అంతర్యమేమిటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఆదాయ మార్గాల కోసం అన్వేషిస్తున్న తరుణంలో, ఇలాంటి అవినీతి తిమింగలాలు ప్రభుత్వ ఖజానాకు కన్నం వేయడంపై ఏసీబీ (ACB) రంగంలోకి దిగాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నూతన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మరియు సీఎం రేవంత్ రెడ్డి ఈ 'పన్ను'గడపై ఉక్కుపాదం మోపుతారో లేదో వేచి చూడాలి.

## కృత్రిమ మేధను చాకచక్యంగా వాడుకోవాలి..

# ఫలితాలు అద్భుతంగా ఉంటాయి..



బోయనపల్లి రమణారావు
9390267118

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ప్రస్తుతం ప్రపంచం మొత్తాన్ని ఒక ఊపు ఊపేస్తున్న పదం. దీనివల్ల లాభమా, నష్టమా అనే చర్చ ప్రతి ఇంట్లోనూ, ప్రతి ఆఫీసులోనూ జరుగుతోంది. ఈ సాంకేతిక విప్లవం వెనుక ఉన్న అసలు వాస్తవాలను ఒక విశ్లేషణాత్మక కోణంలో చూద్దాం. ఏ ఐ అనేది కేవలం ఒక సాఫ్ట్‌వేర్ కాదు, అది మనిషి మేధస్సుకు ఒక 'ఎక్స్‌టెన్షన్' లాంటిది. మనిషి గంటల తరబడి చేసే పనిని ఏ ఐ సెకన్లలో పూర్తి చేస్తుంది. ఉదాహరణకు, వేల పేజీల డాక్యుమెంట్లను విశ్లేషించడం లేదా సంక్లిష్టమైన లెక్కలను తేల్చడం. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడంలో ఏ ఐ డాక్టర్ల కంటే మెరుగైన ఫలితాలను ఇస్తోంది. మీ ఫోన్‌లోని గూగుల్ అసిస్టెంట్ నుండి, నెట్‌ఫ్లిక్స్ ఇచ్చే మూవీ రికమెండేషన్స్ వరకు అన్నీ ఏ ఐ వల్లే సాధ్యమవుతున్నాయి. అయితే ఏ కొత్త టెక్నాలజీకైనా రెండు వైపులా పదును ఉంటుంది. ఏ ఐ విషయంలో ప్రధానంగా మూడు భయాలు ఉన్నాయి.. దుర్వినియోగం ఒకటి.. ఒక వ్యక్తి మాట్లాడని మాటలను మాట్లాడినట్లుగా, చేయని పనులను చేసినట్లుగా సృష్టించే 'డీప్‌ఫేక్' వీడియోలు సమాజానికి పెద్ద ముప్పు. నిర్ణయాధికారం ఒక ఎత్తు యుద్ధ విమానాలు లేదా ఆయుధాలు సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెడితే అది మానవాళికే ప్రమాదం కావచ్చు. గోప్యత కూడా ఒక సమస్యే మన వ్యక్తిగత డేటాను ఏ ఐ ఏ విధంగా వాడుకుంటుందనేది ఎప్పుడూ ఒక ప్రశ్నార్థకమే. చాలామంది భయపడుతున్నట్లుగా ఏ ఐ అందరి ఉద్యోగాలను తీసేయదు, కానీ ఉద్యోగ స్వభావాన్ని మారుస్తుంది. డేటా ఎంట్రీ, అకౌంటింగ్, బేసిక్ కోడింగ్ వంటి పనులను ఏ ఐ తీసుకుంటుంది. ఏ ఐ ని ఎలా ఉపయోగించాలో తెలిసిన వారికి విపరీతమైన డిమాండ్ పెరుగుతుంది. "మీ ఉద్యోగాన్ని ఏ ఐ తీసేయదు.. ఏ ఐ ని వాడుకోవడం తెలిసిన మరో వ్యక్తి మీ ఉద్యోగాన్ని తీసుకుంటాడు." కాబట్టి నైపుణ్యాలను పెంచుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం ప్రపంచం నడుస్తోంది 'డేటా' మీద. ఈ డేటాను మనిషి మెదడు విశ్లేషించలేనంత వేగంగా ప్రపంచం విస్తరిస్తోంది. ఒక దేశం లేదా ఒక కంపెనీ ఏ ఐ ని వాడకపోతే, వాడే వాళ్ళకంటే వెనుకబడిపోతారు. ఇది ఒక 'టెక్నాలజీ రేస్'. ఏ ఐ వల్ల ఉత్పాదకత పెరుగుతుంది. దీనివల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తాయి. వాతావరణ మార్పులు వంటి గ్లోబల్ సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన మోడల్స్ కేవలం ఏ ఐ ద్వారానే సాధ్యం. ఏ ఐ అనేది మనిషిని నాశనం చేసే 'రాక్షసి' కాదు, అలాగని అన్నీ ఇచ్చే 'కామధేనువు' కూడా కాదు. ఇది మన చేతిలో ఉన్న ఒక శక్తివంతమైన ఉపకరణం. దీన్ని మనం ఎంత బాధ్యతగా, ఎంత నైపుణ్యంతో వాడుకుంటామనే దానిపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

# రాచకొండ పేరు మార్చి... మల్కాజ్‌గిరి సెక్యూరిటీ కౌన్సిల్ షురూ!

*** సెక్యూరిటీ కౌన్సిల్‌లో భారీ మార్పులు.. సీపీ అవినాష్ మహంతి సరికొత్త ప్లాన్**

*** పేరు మార్పు వెనుక అసలు కథ ఇదే.. క్షేత్రస్థాయిలోకి పోలీసింగ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 22(భారత శక్తి): రాచకొండ కమిషనరేట్ పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు 'రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్' (RKSC) గా ఉన్న సంస్థ, ఇకపై 'మల్కాజ్‌గిరి సెక్యూరిటీ కౌన్సిల్' (MKSC) గా అవతరించింది. కేవలం పేరు మార్చడమే కాదు, క్షేత్రస్థాయిలో నేరాల నియంత్రణకు సీపీ అవినాష్ మహంతి పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. శనివారం నేరెడ్‌మెట్ కమిషనరేట్‌లో జరిగిన మీటింగ్‌లో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

**ఎందుకీ మార్పు?**

రాచకొండ కమిషనరేట్ విభజన తర్వాత భౌగోళిక పరిస్థితులు మారాయి. ప్రస్తుతం కార్యకలాపాలన్నీ మల్కాజ్‌గిరి కేంద్రంగానే సాగుతుండటంతో, పారిశ్రామిక వర్గాల్లోనూ, సామాన్య ప్రజల్లోనూ కన్ఫ్యూజన్ లేకుండా ఉండేందుకు ఈ పేరు మార్పు నిర్ణయం తీసుకున్నారు.

**సీపీ టార్గెట్లు.. డీసీపీల పర్యవేక్షణ**

కొత్తగా రూపుదిద్దుకున్న MKSCలో జవాబుదారీతనం పెంచేందుకు సీపీ కఠిన నిబంధనలు పెట్టారు:

త్రైమాసిక లక్ష్యాలు: ప్రతి మూడు నెలలకోసారి ఏం సాధించామో రిపోర్ట్ ఇవ్వాలి.

డీసీపీలే కన్వీనర్లు: ట్రాఫిక్, సైబర్ క్రైమ్, మహిళా భద్రత విభాగాలకు డీసీపీ స్థాయి అధికారులను కన్వీనర్లుగా నియమించారు. దీనివల్ల పోలీసులకు, కౌన్సిల్‌కు మధ్య గ్యాప్ ఉండదు.

*** టార్గెట్ 'సైబర్ నేరాలు'.. ఇక డిజిటల్ హైజీన్!**





ప్రస్తుతం ఫోన్ లింకులు, ఫేక్ యాప్‌లతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. అందుకే ఐటీ కంపెనీలకే కాకుండా, చిన్న పరిశ్రమలు (MSME), నాన్‌ఐటీ సంస్థలకు కూడా 'డిజిటల్ హైజీన్' (డిజిటల్ పరిశుభ్రత)పై పాఠాలు చెప్పాలని నిర్ణయించారు. సైబర్ సెక్యూరిటీ ఫోరమ్ ద్వారా ఇంటింటికీ అవగాహన తీసుకెళ్లేలా ప్లాన్ చేశారు.

*** మహిళల కోసం 'మార్గదర్శి'.. ట్రాఫిక్ కోసం 'మార్షల్స్'**

మహిళల భద్రత కోసం గతంలో సక్సెస్ అయిన 'మార్గదర్శక్' ప్రోగ్రామ్‌ను మళ్లీ రీస్టార్ట్ చేస్తున్నారు. ప్రతి ఆఫీసులో ఒక మహిళా ప్రతినిధిని 'మార్గదర్శి'గా నియమించి, మహిళా ఉద్యోగులకు భరోసా కల్పించనున్నారు. మరోవైపు, పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తట్టుకునేందుకు 'స్పాన్సర్డ్ ట్రాఫిక్ మార్షల్స్' కాన్సెప్ట్‌ను తెచ్చారు. కార్పొరేట్ కంపెనీల సీఎస్ఆర్ (CSR) నిధులతో సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ కష్టాలు తీర్చనున్నారు.

**హైలైట్స్:**

- ఎలక్ట్రిక్ పెట్రోలింగ్: పర్యావరణం కోసం ఈవీ వాహనాలను వాడాలనే ఆలోచన.
- సీసీటీవీల మెయింటెనెన్స్: టెక్నాలజీ సాయంతో నేరగాళ్లకు చెక్ పెట్టడం.
- కొత్త టీమ్: వైస్ ఛైర్మన్ పి. సుధాకర్, సెక్రటరీ డాక్టర్ రఘువీర్ నేతృత్వంలో కొత్త కార్యవర్గం బాధ్యతలు. పోలీస్‌ప్రజల మధ్య గ్యాప్ తగ్గించి, మల్కాజ్‌గిరిని క్రైమ్ ఫ్రీ జోన్‌గా మార్చడమే లక్ష్యంగా MKSC అడుగులు వేస్తోంది. ఇది కేవలం పేపర్ మీద ప్లాన్ కాకుండా గ్రౌండ్ లెవల్లో అమలైతేనే ఫలితం ఉంటుంది.



దిల్సుఖ్ నగర్ బాంబ్ పేలుళ్లకు పాల్పడిన తీవ్రవాదుల దుశ్చర్యకు నిరసనగా, శనివారం గడ్డిఅన్నారం డివిజన్ భారాస పార్టీ ఆధ్వర్యంలో (రాజీవ్ చౌక్)వద్ద అమరులకు ఘనంగా నివాళులు అర్పించి మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్ కుమార్,బీచినేపల్లి వేంకటేశ్వరావు,రమేష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జక్కల శ్రీశైలం యాదవ్, రమణారెడ్డి, నర్సింహారావు, హరీష్ చారి,తిరుపతి,యాద శంకర్, విక్కీ గౌడ్,మల్లేష్, లక్ష్మణ్, వాణి, విజయలక్ష్మి, అరుంధతి,నాగమణి, హసీనా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, ఫిబ్రవరి 22 (భారత శక్తి):

# పదవి ముగిసినా ప్రజాసేవ కొనసాగిస్తున్న మాజీ కార్పొరేటర్

ఎల్బీనగర్, ఫిబ్రవరి 22 (భారత శక్తి): గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి శనివారం ఉదయం నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేటర్‌గా తన పదవీకాలం పూర్తయినప్పటికీ నిత్యం ప్రజల మధ్యనే ఉంటానని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కాలనీ వాసులు ప్రస్తావించిన పలు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి



పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కారానికి చర్యలు ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ని కాలనీ వాసులు అభినందించారు. ప్రజల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు హరి బాబు, బుచ్చిరెడ్డి, హర్ష, కొత్త సాయి తరుణ్ రెడ్డి, దినేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్, వివేక్ చారీ, సిద్ధు, టింకు, గిరీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.